ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 23 ఫిబ్రవరి 2025 | 5



రాజమండ్రి శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం వారి నృత్య ప్రదర్శనలో ఓ దృశ్యం



రాజస్థాన్ వర్సెస్ కేరళ హాకీ పోటీలో...

హాకీ.. ఆహ్లాదం!

కాకినాడ క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు హోరాహోరీగా సాగుతోంది. శనివారం వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లు కలిసి మొత్తం 8 మ్యాచ్‌లు ఆడాయి. సాయంత్రం క్రీడాకారుల కోసం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. వివిధ రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

6



మన ఊరి నుంచి మహా యాత్ర!

ఆర్టీసీ ప్రయాగ్‌ం అదుర్స్

- మహా కుంభమేళాకు వేలాది మంది..
- రైళ్లు, బస్సుల్లో తరలివెళ్లిన భక్తజనం
- అటు భక్తులకు సేవ.. ఇటు ఆదాయం

ప్రత్యేక కథనం 6



చేను ఎండిపోతోంది..

అధికారుల నిర్లక్ష్యంతో దాళ్వాకు గండం
వంతు రోజున నీరివ్వకపోవడంతో బీటలు వారుతున్న చేలు
క్షేత్రస్థాయిలో విఫలమవుతున్న వంతుల వారీ విధానం
ఆందోళనలో అన్నదాతలు

కాట్రేనికోన, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వంతుల వారీ విధానమన్నారు.. సాగునీటికి ఆందోళన అవసరం లేదన్నారు..ఇలా అధికారుల భరోసాతో దాళ్వా సాగు చేసిన రైతులు ఇప్పుడు తలపట్టుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. వంతులవారీ విధానం అమలులో ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. సాగునీరందక బీటలు వారుతున్న పంట పొలాలను చూసి రైతులు లబోదిబోమంటున్నారు. ఎన్.కొత్తపల్లి పంటకాల్వ పరిధిలోని కాట్రేనికోన ఏరియాలో ప్రస్తుతం దాళ్వా పొలాల పరిస్థితి దయనీయంగా ఉంది. 20రోజులుగా పొలాలకు చుక్కనీరందలేదంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.. ప్రతి సోమవారం నీరు వంతు కట్టాల్సి ఉండగా అధికారులు నిబంధన పాటించలేదు. తప్పు కప్పిపుచ్చుకునేందుకు వంతు కాని రోజు రైతులకు తెలియజేయకుండా కాల్వకు నీరు వదిలారు. నీరు వస్తున్న సమాచారం రైతులకు ఎంతమాత్రం తెలియలేదు. సాగునీరు వినియోగం కంటే ఎక్కువగా వృధా అయ్యింది. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఇరిగేషన్ జేఈ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా నీటి ఇబ్బందులున్నాయన్నారు. ఆది, సోమ, మంగళవారాలు ఎన్.కొత్తపల్లి పంటకాల్వకు నీరు ఇస్తున్నట్టు ఆంధ్రజ్యోతికి తెలిపారు.



మండపేట మండలంలో పనిచేయని చెత్త సంపద కేంద్రం

చెత్త సంపద కేంద్రాలపై నిర్లక్ష్యపు నీడ

జిల్లాలో మూతపడ్డ పలు చెత్త సంపద కేంద్రాలు
చాలాచోట్ల రోడ్డుపైనే చెత్త
రోడ్లు,కాల్వలు చెత్తకుప్పలుగా..

మండపేట,ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):

చెత్త సంపద కేంద్రాల్లో తడిచెత్త, పొడి చెత్త ఊసే కనిపించడం లేదు. మరోపక్క చెత్త సంపద కేంద్రాలకు వేసిన తాళాలు తీసే దారి కూడా లేదు. ఎక్కడ చూసినా మూతపడి ఉంటున్నాయి. ఆ గ్రామాల్లో తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వండి.. సేకరించిన చెత్తతో సంపద సృష్టిద్దాం..అంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ఆచరణలో కనిపించడం లేదు.

ప్రచార ఆర్భాటమే..

జిల్లా మొత్తం మీద స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ భారత్, పరిసరాల పరిశుభ్రత, తడి చెత్త , పొడి చెత్తమీద తదితర అంశాలపై చేస్తున్న ప్రచారం ప్రచారంగానే మిగిలిపోతోంది. పల్లెల్లో ఎక్కడా ఈ కార్యక్రమం విజయవంతం కావడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పుడు చెత్త సంపద కేంద్రాలపై దృష్టి సారించడంతో కాస్తంత కదలిక వచ్చింది. జిల్లాలో 255 చెత్త సంపద కేంద్రాలు ఉండగా అందులో చెత్త సంపదను ఎరువు తయారు చేసి పనిచేసేవి 45 వరకు ఉంటాయని అధికారులు చెబుతున్నప్పటికి అసలు వాటి ద్వారా ఉత్పత్తి అయ్యే సంపద ఎరువు అసలు కొనుగోలు జరుగుతుందా?లేదా అసలు పరిస్థితేమిటనేది అధికారులకు కూడా తెలియడం లేదు. ఇక చెత్తను సేకరించే రిక్షాలు మూలకు చేరాయి. అలాగే వాహనాలు కూడా పలు చోట్ల కదలటం లేదు. దీంతో పారిశుధ్య సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా తాళాలు వేసి మూతపడిన చెత్తసంపద కేంద్రాలపై కూటమి ప్రభుత్వం కాస్తంత దృష్టి సారించి పునరుద్ధరించడంతో పాటు చెత్తను వేసేందుకు అవసరమైన యార్డు స్థలాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో బాపూజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం వైపు అడుగులు వేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



కేశవరంలో సేంద్రియ ఎరువు నిల్వలు

వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం

జిల్లాలో ఉన్న 385 పంచాయతీల్లో వేళ్ల మీద పనిచేసే సంపద కేంద్రాలు లెక్కించవచ్చు. చెత్త సంపద కేంద్రాలు వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రంగులు రాయడం తప్ప ఎక్కడా సేంద్రియ ఎరువు సంపద మాత్రం పెరగలేదు. ఇప్పుడు ఎక్కడ చూసినా చెత్త సంపద కేంద్రాలు మూతపడే దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ రికార్డులు లెక్కల్లో మాత్రం చెత్తసంపద కేంద్రాలు ఘనంగా పనిచేస్తున్నాయని చూపిస్తున్నారు తప్ప అవెక్కడా తెరుచుకుని సేంద్రియ ఎరువు తయారు చేసిన దాఖలాలు కనిపించటంలేదు. ఇక చెత్త ద్వారా సేంద్రియ ఎరువును తయారు చేసినా కూడా కొనేవారు లేక కొన్నిచోట్ల సేంద్రియ ఎరువుల నిల్వలు పేరుకుపోతున్నాయి. ఉన్న ఎరువును ఏం చేయాలో తెలియని పరిస్థితి కొన్ని పంచాయతీల్లో నెలకొంది.



మూలకు చేరిన చెత్తను సేకరించే రిక్షాలు..

ఎక్కడ పడితే అక్కడ చెత్త దర్శనం

గ్రామ పంచాయతీల్లో చెత్త వేసేందుకు స్థలం లేక వచ్చే చెత్తను రోడ్లు, పంట కాల్వలు మురుగు కాల్వలు, చెరువు గట్లపై పోస్తున్నారు. కుప్పలు తెప్పలుగా చెత్త నిల్వలు అలా పోస్తుండటంతో కాల్వలు డ్రైన్‌లు, రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. చెత్త వేసే దారి లేదు. దీంతో చేసేదిలేక చెత్తను ఎక్కడపడితే అక్కడ ఊరికి దూరంగా కొన్నిచోట్ల వేస్తున్నారు. జిల్లాలో 385 పంచాయతీలు వరకు ఉన్నాయి. వాటిలో చాలా వరకు చెత్తను వేసేందుకు చోటు లేకపోవటం స్థల కొరత కారణంగా గ్రామాల్లో రోడ్ల పైన, పంట, మురుగు కాల్వల గట్లపైనా చెత్తను వేస్తున్నారు.



మండపేట మండలం తాపేశ్వరం పేకేటిపాకలు వెళ్లే రోడ్డులో రోడ్డు పక్కనే చెత్త..

సబ్సిడీపై సబ్జి కూలర్లు

విద్యుత్, ఇంధనం ఆదా
ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పంపిణీ



కొత్తపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏ విధమైన ఇంధనం గాని, విద్యుత్ గాని, సౌర విద్యుత్ లేకుండా పనిచేసే ఆర్గానిక్ సబ్జి కూలర్లు ఉద్యాన శాఖ ద్వారా అందుబాటులోకి వచ్చినట్లు కొత్తపేట డివిజన్ ఉద్యానవన శాఖాధికారి జి.కోటేశ్వరరావు తెలిపారు. ఐఐటీ, ముంబై వారు రూపొందించిన రూకార్ట్ సబ్జి కూలర్లు ఏడు అంచుల నిర్మాణం కలిగి ఆవిరి ద్వారా పండ్లు, కూరగాయలు, పువ్వులు మొదలగు వాటిని చల్లగా ఉంచి పాడవకుండా చూస్తాయి. నిల్వ సామర్థ్యాన్ని పెంచుతాయి. ఏపీ ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా రైతు బజార్లకు, రైతులకు పండ్ల వ్యాపారులకు వీటిని 50 శాతం రాయితీపై అందిస్తున్నారు. ఈ కూలర్ 25 కేజీల నుంచి 100 కేజీల వరకూ సామర్థ్యం కలిగి ఉంటుంది. ఈ కూలర్లు కావాల్సిన వారు ఉద్యాన వన శాఖకు దరఖాస్తు చేసుకుని 50 శాతం సొమ్మును డీడీ ద్వారా అందచేస్తే ఈ ఆర్గానిక్ సబ్జి కూలర్లు పంపిణీ చేస్తారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోటేశ్వరరావు కోరారు.



లింగ వివక్షను రూపుమాపేందుకు అవగాహనా ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న జేసీ నిషాంతి..

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బాలికలను రక్షించి బాలికా విద్యను ప్రోత్సహించడంతో పాటు లింగ వివక్షను రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమం ఆశించిన సత్ఫలితాలు అందిస్తుందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమం ప్రారంభించి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళా సంక్షేమశాఖ, మహిళా పోలీసు సిబ్బందితో చేపట్టిన బైక్ ర్యాలీని కలెక్టరేట్ వద్ద శనివారం జేసీ నిషాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమం ద్వారా బాలికల హక్కులు, విద్య, గౌరవానికి కొత్త కోణాన్ని చూపించిందన్నారు. ఈ పథకాన్ని ప్రధాని మోదీ 2015 జనవరి 22న ప్రారంభించారన్నారు. ఈ పథకం ద్వారా శిశు లింగ నిష్పత్తి క్షీణతను అరికట్టడం, మహిళా సాధికారతను ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాస్థాయిలో ఒకప్పుడు బాలికల శాతం తక్కువగా ఉండేదని, కార్యక్రమం ద్వారా అవగాహనతో లింగ నిష్పత్తిశాతం మెరుగుపడిందన్నారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం వరకు జరిగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ పథక సంచాలకురాలు బి.శాంతకుమారి, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు, ఎస్ఐలు, సీడీపీవోలు, మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సమన్వయంతో శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

కోటిపల్లి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి
అధికారులకు దిశానిర్దేశం చేసిన ఆర్డీవో అఖిల



పుష్కరాల రేవులో పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల

కె.గంగవరం, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి పుణ్యక్షేత్రంలో ఈనెల 25 నుంచి 27 వరకూ నిర్వహించే శివరాత్రి ఉత్సవాలను, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ చైర్మన్, రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల అన్నారు. శనివారం శ్రీ ఛాయాసోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆమె వివిధ శాఖల అధికారులతో సమీక్ష చేశారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాల్లో లైటింగ్, మార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి గుడికి వచ్చేదారిలో భక్తులకు తాగునీటి సదుపాయం కల్పించాలని, స్నానాల రేవులో బారికేడింగ్ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించే మహిళా భక్తుల కోసం తాత్కాలిక షెడ్ పనులు వెంటనే ప్రారంభించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఉత్సవాల మూడు రోజులు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని విద్యుత్ శాఖ ఏఈని ఆదేశించారు. బారికేడింగ్ వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ, దేవస్థానం అధికారులను ఆదేశించారు. నాలుగు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ అధికారులతో చెప్పారు. రామచంద్రపురం డీఎస్పీ బి. రఘువీర్ మాట్లాడుతూ ఫెర్రీ రేవులో ప్రయాణించే పంటులతో పాటు గజ ఈతగాళ్లతో రెండు నావలు ఏర్పాటు చేయాలని ఫిషరిష్ డిపార్ట్‌మెంట్‌ను కోరారు. అదే విధంగా రేవులో రెండు వైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఆర్థిక భారంపై సతమతం

కోటిపల్లి పుణ్యక్షేత్రంలోని శ్రీ ఛాయాసోమేశ్వర ఆలయానికి ఆదాయం తక్కువ. కానీ మహా శివరాత్రి ఉత్సవాలకు సుమారు లక్ష మంది భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. దైవ దర్శనానికి వచ్చే భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేయడానికి ఆర్థికపరమైన ఇబ్బందులు వెంటాడుతున్నాయి. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల రక్షణ కోసం ఏర్పాటు చేసే గజ ఈతగాళ్లు, నావల ఏర్పాట్లకు సంబంధించి ఆర్థికపరమైన ఇబ్బందులను దేవదాయ శాఖ, పంచాయతీ అధికారులు ఆర్డీవోకు వివరించారు. ఖర్చును రెండు శాఖల వారు భరించే విధంగా ఆమె సర్దిచెప్పారు. సంవత్సరానికి ఒక్కసారి కోటిపల్లి పుణ్యక్షేత్రంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు దేవదాయశాఖ నుంచి ప్రత్యేక గ్రాంటు తీసుకువచ్చి ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు దేవదాయ శాఖ ఉన్నతాధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్‌వో చక్రదరరావు, ఆలయ తనిఖీ అధికారి బాలాజీ రామ్‌ప్రసాద్, ఈవో భీమశంకరం, ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు, కూటమి నాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, రేవు శ్రీను, గొడవర్తి రామకృష్ణ, చీకట్ల సోమేష్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెత్త దహనంతో ఆరోగ్యం దెబ్బతింటోంది..

డంపింగ్ యార్డు వద్ద స్థానికుల ధర్నా



స్థానికుల ఆందోళన దృశ్యం..

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అమలాపురం డంపింగ్ యార్డులో చెత్తను తగలబెట్టడం వల్ల విడుదలవుతున్న పొగతో ప్రజారోగ్యం దెబ్బతింటుందని, చెత్త వేయడాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం డంపింగ్ యార్డు ముఖద్వారం వద్ద పరిసర ప్రాంతాల వార్డు ప్రజలు టెంట్ వేసి ధర్నా చేపట్టారు. పట్టణం నుంచి సేకరించిన చెత్తను తీసుకువస్తున్న ట్రాక్టర్లను లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు, పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న వారితో పలు దఫాలుగా చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లోను చెత్తను వేయనిచ్చేది లేదని భీష్మించారు. నిరసన శిబిరంలో కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ, నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, కల్వకొలను బాబి, సుంకర సుధ, దొంగ చిన్నా తదితరులు పాల్గొన్నారు. ఆ సమయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణితో కలిసి పట్టణానికి చెందిన కౌన్సిలర్లంతా పార్టీ రహితంగా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును కలుసుకుని వినతిపత్రం అందజేశారు. అమలాపురం పట్టణ పరిసర గ్రామాల్లోని చెత్తను సేకరించి స్థానిక డంపింగ్ యార్డుకు తరలించడంలో ఎదురయ్యే ఇబ్బందులను కౌన్సిలర్లు తిక్కిరెడ్డి వెంకటేష్, యేడిద శ్రీను, మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, గండి దేవిహారిక వివరించారు. భవిష్యత్తులో సమీపంలోని గ్రామాలు పట్టణంలో విలీనమయ్యే అవకాశం ఉందని, డంపింగ్ యార్డు కోసం స్థల సేకరణకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఆనందరావు వివరించారు. అయితే డంపింగ్ యార్డు వల్ల స్థానిక వార్డుల ప్రజలు పడుతున్న అవస్థలను ఎమ్మెల్యేకు వివరించారు. భూ సేకరణ జరిపే వరకు గ్రామాల నుంచి చెత్తను తీసుకువచ్చే ట్రాక్టర్లను నిలుపుదల చేయాలని కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, తిక్కా సత్యలక్ష్మి, దొమ్మేటి రాము తదితరులు కోరారు. భూసేకరణకు ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో డంపింగ్ యార్డు ఎదుట చేపట్టిన ధర్నాను స్థానికులు విరమించడంతో చెత్త ట్రాక్టర్లు లోనికి వెళ్లాయి.

మన ఊరి నుంచి మహా యాత్ర

ఆర్టీసీ ప్రయాగ్ం అదుర్స్



అమలాపురం/రాజమహేంద్రవరం అర్బన్/ కార్పొరేషన్ (కాకినాడ)/ కొవ్వూరు/నిడదవోలు/ ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):

కుంభమేళాకు ఎన్నడూ లేనంతగా వేలాది సంఖ్యలో ఈసారి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి భక్తులు తరలివెళ్లారు. ఇది 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చేదని ప్రచారం జరగడంతో దీనిపై మరింత ఆసక్తి పెరిగింది. దీనికనుగుణంగా తప్పనిసరిగా కుంభమేళాకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించాలని జనం భావించారు. ఎంతో దూరం, మరెంతో వ్యయప్రయాసలైనప్పటికీ భక్తులు వెళ్లారు. రైళ్లలోను, బస్సుల్లోనూ ఈ ప్రయాణాలు చేసేందుకు అందరూ ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రత్యేక రైళ్లు వేయడంతో కొంతవరకు ఈ మార్గాన వెళ్లారు. అయితే చాలా మంది బస్సుల్లో తీర్థయాత్రల మాదిరిగా వెళ్లడానికి ఆసక్తి చూపారు. దీనికి ప్రధాన కారణం ఏపీఎస్ ఆర్టీసీయే. సాధారణంగా పండుగల్లో స్పెషల్ సర్వీసులు నడపడం ఆర్టీసీకి కొత్తేమీ కాదు. పంచారామ క్షేత్రాల దర్శనాలకూ సర్వీసులు నడుపుతారు. కానీ కొద్దికాలంగా ఆర్టీసీ అధికారులు వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకునేందుకు డిపోల వారీగా పోటీ పడుతున్నారు. అరుణాచలం గిరి ప్రదక్షిణలకు ప్రతి నెలా సర్వీసులు నడుపుతున్నారు. ఏకాదశ రుద్రుల దర్శనం పేరిట కొవ్వూరు డిపో నుంచి వంద బస్సులకు పైగా ప్రత్యేక సర్వీసులు నడిపారు. ఇలా ప్రతి సందర్భాన్ని ఆర్టీసీ యాత్రల పేరిట సర్వీసులు నడపడం విశేషం. ఇందులో భాగంగానే కుంభాభిషేకానికి ప్రత్యేక సర్వీసులను పెద్దఎత్తున నడిపారు. వేలాది కిలోమీటర్ల మేర సర్వీసులు నడపడం అంటే ఆషామాషీ కాదు. యాత్ర బస్సు అంటేనే భోజన, వసతి సౌకర్యాలు సైతం సమకూర్చాలి. ఎలాంటి ఇబ్బందులు ప్రయాణికులకు కలుగకుండా నడపాలి. ఈసారి కుంభమేళాలో ఆర్టీసీ సర్వీసులకు ఎంతో ఆదరణ దక్కింది. భోజన, వసతి సదుపాయాల్లో చక్కటి సౌకర్యాలు సంతృప్తి కలిగించాయి. టిక్కెట్టు ధర కూడా రూ.10,800 నుంచి రూ.12500 మధ్య అందుబాటులోనే ఉండడం మరింత వెసులుబాటు కలిగించింది. ఇన్ని సౌకర్యాలు కల్పిస్తూనే ఆర్టీసీ కూడా తమ ఆదాయాన్ని గణనీయంగా పొందడం మరో విశేషం.

కోనసీమ జిల్లాలో రూ.97 లక్షల ఆదాయం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వేలాది మంది భక్తులు తరలి వెళుతున్నారు. రైళ్లు, విమాన ప్రయాణాలతోపాటు ఆర్టీసీ బస్సుల ద్వారా కూడా భారీ సంఖ్యలో ప్రజలు కుంభమేళాకు వెళ్లి పవిత్ర పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. జిల్లా పరిధిలోని అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం బస్ డిపోల నుంచి ఇప్పటి వరకు 25 బస్సుల్లో 900 మంది ప్రయాణికులు కుంభమేళాకు వెళ్లారు. ఈ యాత్రకు ఆర్టీసీ సూపర్‌లగ్జరీ వీడియో కోచ్‌లు ప్రయాణికుల కోసం ఏర్పాటుచేసింది. మొత్తం 14 ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాల్లో ముఖ్యమైనవి వారణాశి, అయోధ్యతోపాటు ప్రయాగరాజ్‌లో త్రివేణి సంగమ పుణ్యస్నానాలు చేస్తున్నారు. ఒక్కొక్క ఆర్టీసీ బస్సులో 36 మంది ప్రయాణికులతో వెళ్లాయి. అమలాపురం డిపో నుంచి ఇప్పటి వరకు తొమ్మిది బస్సులు, రావులపాలెం నుంచి 8, రామచంద్రపురం డిపో నుంచి 4, రాజోలు డిపో నుంచి 4 వెరసి 25 బస్సుల్లో 900 మంది ప్రయాణికులు కుంభమేళాకు వెళ్లారు. ఆర్టీసీ సౌకర్యాల పట్ల భక్తులైతే హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. అయితే ఎనిమిది రోజుల ట్రిప్‌కుగాను ట్రాఫిక్ రద్దీ కారణంగా పది రోజులు పడుతుందనేది ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.



'తూర్పు' రూ.47.52 లక్షలు

ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు తూర్పుగోదావరి జిల్లా ఆర్టీసీ 532 మంది భక్తులను ఇప్పటిదాకా పుణ్యస్నానాలకు తీసుకెళ్లింది. ఈ కుంభమేళా టూర్ ద్వారా జిల్లా ఆర్టీసీకి రూ.47,52,400ల ఆదాయం లభించింది. రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి మొత్తం 16 బస్సులను ఆపరేట్ చేశారు. గోకవరం డిపో నుంచి రెండు బస్సుల్లో 68 భక్తులు, కొవ్వూరు డిపో నుంచి ఐదు బస్సుల్లో 154 మంది భక్తులు, నిడదవోలు డిపో నుంచి రెండు బస్సుల్లో 72 మంది, రాజమహేంద్రవరం డిపో నుంచి ఏడు బస్సుల్లో 238 మంది భక్తులు కుంభమేళాకు వెళ్లి వచ్చారు. మొత్తం 66,000 కిలోమీటర్లు మేర ఆర్టీసీ బస్సులను నడపడం ద్వారా జిల్లా ఆర్టీసీ రికార్డు సృష్టించింది.

కాకినాడ జిల్లా రూ.40.68 లక్షలు

ఈ ఏడాది జనవరి 31 నుంచి ఫిబ్రవరి 23 వరకు కుంభమేళాకు కాకినాడ జిల్లా నుంచి 14 బస్సులు భక్తులను సురక్షితంగా తీసుకెళ్లి తీసుకువచ్చాయి. ఇందుకుగాను ఆర్టీసీకి రూ.40.68 లక్షలు ఆదాయం వచ్చింది. కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి కుంభమేళాకు బయలుదేరిన ప్రతీ బస్సు మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి ప్రయాగ్‌రాజ్, వారణాసి, అయోధ్య, పూరి, కోణార్క్ వంటి ప్రాంతాలన్నీ భక్తులకు దర్శనార్థం తీసుకెళ్లి ఎనిమిదవ రోజు ఉదయం కాకినాడ డిపోకి చేర్చేవారు. భక్తులకు ఆర్టీసీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి వేళలో టిఫిన్ ఇచ్చేవారు. కాగా కొవ్వూరు ఆర్టీసి డిపో నుంచి కుంభమేళాకు 5 బస్సుల్లో 162 మంది యాత్రికులను పంపించినట్టు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. కుంభమేళా ప్రత్యేక సర్వీసుల ద్వారా కొవ్వూరు డిపోకు టిక్కెట్ల ద్వారా రూ. 19.75 లక్షల ఆదాయం రాగా, రూ. 10.20 లక్షలు ఖర్చులు అయ్యిందన్నారు. ప్రత్యేక సర్వీసుల ద్వారా కుంభమేళాకు వెళ్లిన భక్తులకు ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటుచేశామన్నారు. ప్రతి బస్సులో మెడికల్ కిట్టుతో మెకానిక్, వంటమాస్టర్, భక్తుల సౌకర్యార్థం గైడ్‌ను ఏర్పాటుచేశామన్నారు. బస్సులో ఇద్దరు డ్రైవర్లు, డ్రైవర్ల నంబర్లతో కూడిన ఐడీ కార్డులను ప్రతి యాత్రికుడికి అందించి సురక్షితంగా యాత్రికులను తిరిగి ఇంటికి చేర్చడం జరిగిందన్నారు. ప్రయోగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాకు నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి రెండు సర్వీసులు నడిపినట్టు కాకినాడ డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బస్సుల్లోనే వంట మనుషులు, వంట సామగ్రి.. దర్శనీయ క్షేత్రం తెరిచే సమయానికి బస్సు చేరుకునేలా ప్రణాళిక... దర్శనం చేసుకుని వచ్చేసరికి అల్పాహారం రెడీ... మళ్లీ ప్రయాణం.. మధ్యలో భోజనం.. ఇలా పక్కా ప్లాన్‌తో కుంభమేళా టూర్‌ను ఆర్టీసీ అధికారులు సక్సెస్ చేశారు. గతంలో అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠకు బస్సులను నడిపిన అనుభవం ప్రయాగ్‌రాజ్ కుంభమేళా టూర్‌కు ఎంతో ఉపయోగపడింది.

● ముందుగా కొవ్వూరు డిపో నుంచి..

ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు ముందుకు కొవ్వూరు డిపో నుంచి బస్సులు నడిపారు. ఆ తర్వాత రాజమహేంద్రవరం డిపోతోపాటు గోకవరం, నిడదవోలు, రావులపాలెం, కాకినాడ, మచిలీపట్నం, అనంతపురం, కర్నూలు నుంచి బస్సులు పెట్టారు. గతంలో కొవ్వూరు డిపో నుంచి ఒక రోజు యాత్రకు వచ్చిన భక్తుల ఫోన్ నెంబర్లతో ఒక వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేయడం ఆర్టీసీ అధికారులకు ఎంతో ఉపయోగపడింది. కొవ్వూరు డీఎం కుమార్, ఏడీసీ సూర్యచంద్రరావు ఈ గ్రూప్ కియేట్ చేశారు. అలాగే, రాజమహేంద్రవరం డిపోకు చెందిన సీనియర్ డ్రైవర్ రామకృష్ణ గత కుంభమేళాకు వెళ్లి వచ్చిన అనుభవం ఈ టూర్‌కు బాగా కలసివచ్చింది. ముందుగా కొవ్వూరు డిపో నుంచి ఫిబ్రవరి 1న రెండు బస్సులు కుంభమేళాకు వెళ్లాయి. ఒక బస్సు ఫుల్ కావడంతో, ఆ వెంటనే పుష్‌బ్యాక్ స్లీపర్ బస్సు (నాన్ ఏసీ, స్టార్‌లైనర్) పెట్టారు. ఇలా కుంభమేళా టూర్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో అన్ని డిపోల నుంచి బస్సులు వెళ్లాయి.

ఇష్టమైన మెనూ..

కుంభమేళా యాత్రలో భోజనాలు, దర్శనం, ఇతర సౌకర్యాలకు ఇబ్బంది లేకుండా రెండు, మూడు బస్సులు ఒకేసారి బయలుదేరేలా ప్లాన్ చేసుకున్నారు. వంట కోసం వంటమాస్టర్‌తోపాటు, ఒక మగ, ఇద్దరు మహిళలు (సహాయకులు)ను తీసుకెళ్లారు. వంట సామగ్రి అంతా వాళ్లే తెచ్చుకుంటారు. బస్సు ఆగిన టైంలో వంట చేసి పెడతారు. పూర్తి శాకాహార భోజనం అందించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్ అందించారు. దీనికి ఒకరికి రోజుకు రూ.250 చొప్పున చెల్లించారు. పుష్‌బ్యాక్ సీట్లు కావడంతో బస్సు ప్రయాణంలో యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. బస్సులోనే రెస్ట్ తీసుకునేవారు. ప్రయాగ్‌రాజ్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో బస్సులను ఆపేసేవారు. అక్కడి నుంచి భక్తులు ఆటోలో వెళ్లి దర్శనం చేసుకుని తిరిగి పార్కింగ్ ప్రదేశానికి వచ్చేవారు. ఈ క్రమంలో సంబంధిత ఆర్టీసీ డిపో అధికారులు, టూర్ కో ఆర్డినేటర్లు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయడంతో కుంభమేళా యాత్ర సక్సెస్‌ఫుల్‌గా సాగిందని చెప్పారు.

మహాకుంభ మేళాతో జన్మధన్యం



మహాకుంభ మేళా యాత్రకు వెళ్లడంతో జన్మ ధన్యమైంది. యాత్రలో భాగంగా 14 పుణ్య క్షేత్రాలను దర్శించాం. పుణ్యనదీ స్నానాలు ఆచరించడం జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని మధురానుభూతి. 124 ఏళ్లకు ఒకసారి వచ్చే మహాకుంభమేళాలో పాల్గొనడం దేవుడిచ్చిన వరం. ఆర్టీసీ సంస్థ కల్పించిన సదుపాయాలు అద్భుతం. ఎక్కడా ఎవరికీ ఏ లోటు రానీయలేదు. ఆర్టీసీ సంస్థ భక్తులకు కల్పించిన అద్భుత అవకాశమిది.

కాండ్రేగుల శ్రీనివాసరావు, లక్ష్మీసంధ్య దంపతులు
అంబాజీపేట



మహాకుంభమేళా యాత్రకు వెళ్లిన కోనసీమ బృందం

గ్రేట్ అచీవ్‌మెంట్ ఇది



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు ఆర్టీసీ బస్సులను సక్సెస్‌ఫుల్‌గా నడపడం మాకు పెద్ద అచీవ్‌మెంట్. బస్సు డ్రైవర్లు, కో ఆర్డినేటర్లతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటూ సక్సెస్‌ఫుల్‌గా టూర్ పూర్తి చేశాం. అక్కడ కూడా తెలుగువాళ్లు ఉన్నారు. వాళ్లతో కాంటాక్టు పెంచుకుంటూ ఎప్పటికప్పుడు అక్కడి సమాచారం తెలుసుకుంటూ దానికి అనుగుణంగా చర్యలు తీసుకున్నాం. డ్రైవర్లు, సహకారం అందించిన అధికారులు, ఉద్యోగులను అభినందించే కార్యక్రమం చేపడతాం అని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక వెల్లడించారు. **- షర్మిలా అశోక, ఆర్టీసీ జిల్లా అధికారిణి**

బైక్‌పై ప్రయాగ్‌రాజ్‌కు

రౌతులపూడి నుంచి 1200 కి.మీ..



రౌతులపూడి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): అందరూ రైళ్లలో, బస్సుల్లో కుంభమేళాకు వెళితే, వీరు బైక్‌ల మీద వెళ్లి వచ్చారు. చాలామంది బస్సులు, కార్లు, రైళ్ల ప్రయాణం చేస్తూ కుంభమేళాకు వెళుతుండగా కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామానికి చెందిన యదగిరి శ్రీను, యర్రాశ్రీను, గోడి తాతాజీ, దివిలి సత్తిబాబులు రెండు బైక్ మీద ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లారు. మూడు రోజులు ప్రయాణం చేసి రౌతులపూడి నుంచి ప్రయోగ్‌రాజ్‌కు 1200 కిలోమీటర్లు బైక్‌లపై ప్రయాణం చేశారు.

ప్రణాళికాబద్ధంగా నడిపాం..



కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం కాకినాడ జిల్లా నుంచి ప్రణాళికబద్ధంగా బస్సులు సిద్ధం చేశాం. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా వారికి ఆహార పదార్థాలు కూడా అందించాం. క్షేమంగా వెళ్లి క్షేమంగా తీసుకురావడంలో డ్రైవర్లు చక్కగా వ్యవహరించారు. దీని ద్వారా ఆర్టీసీకి కూడా రూ.40.68 లక్షలు ఆదాయం సమకూరింది.

- శ్రీనివాసరావు, ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి, కాకినాడ



మధ్యప్రదేశ్‌పై ఆంధ్రా విజయం

- బిహార్‌పై ఒడిస్సా
- ఢిల్లీపై హరియాణా
- తెలంగాణపై ఉత్తరాఖండ్
- కర్ణాటకపై ఒడిస్సా
- సిమ్లాపై కాన్పూర్
- ఉత్తరప్రదేశ్‌పై గుజరాత్ విజయం
- ముంబై-బెంగళూరు మ్యాచ్ డ్రా
- ఉత్సాహంగా కినాడలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కలెక్టరేట్/కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ పట్టణం జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లు మొత్తం 8మ్యాచ్‌లు జరిగాయి. రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ వైడీ రామారావు, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ సీఈవో గోవిందరాజు, ట్రస్ట్ ఆసుపత్రి ఛైర్మన్ రామకృష్ణ, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు పాల్గొన్నారు. ఒడిస్సా బీహార్ సెక్రటేరియట్ మహిళ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిస్సా సెక్రటేరియట్ జట్టు 7-0 తేడాతో విజయం సాధించింది. హరియాణా, ఢిల్లీ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హరియాణా సెక్రటేరియట్ 4-0 తేడాతో విజయం సాధించింది. తెలంగాణ సెక్రటేరియట్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ మహిళల జట్టుల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ 20-0 తేడాతో విజయం సాధించింది. ఒడిస్సా, కర్ణాటక సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిస్సా జట్టు 10-2 తే డాతో విజయం సాధిం చింది. ఆర్ఎస్బీ కాన్పూర్, ఆర్ఎస్బీ సిమ్లా జట్ల మధ్య జరి గిన మ్యాచ్‌లో ఆర్ ఎస్బీ కాన్పూర్ 2-0 తేడాతో గెలిచింది. ఆర్ ఎస్బీ ముంబై, ఆర్ఎస్బీ బెంగ ళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఇరు జట్లు 1-1 గోల్స్ నమోదు చేయడంతో మ్యాచ్ డ్రా అయింది. గుజరాత్, ఉత్తరప్రదేశ్ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరి యట్ 5-0 తేడాతో విజయం సాధించింది.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో భాగంగా జిల్లా క్రీడామైదానంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాల్లో హరిప్రియ క్లాసికల్‌డాన్స్, దేవిస్తుతి, రాధాకృష్ణ కళాక్షేత్రం వారి నారాయణ క్లాసికల్, వినాయక కౌముది, తమిళ్,

సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారుల ప్రదర్శనలు



ఒడిస్సా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కళాకారులు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. జై జవాన్ జై కిసాన్, వందేమాతరం వంటి పాటలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేశారు. కోకనాడ పోస్టల్ క్లబ్ ఫౌండర్ రవిచంద్రప్రసాద్ నృత్య కళాకారిణి హరిప్రియకు రూ.5 వేలు చెక్కు అందజేశారు.





పోటీలో తలపడుతున్న క్రీడాకారిణులు



బాల్ కోసం పోటీ పడుతున్న క్రీడాకారిణులు



కళాకారిణి హరిప్రియకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న రవిచంద్రప్రసాద్

పేద క్రీడాకారులకు హాస్టల్స్ ఏర్పాటు చేయాలి



ప్రతిభ ఉండి వెనుకబడిపోతున్న పేద క్రీడాకారుల కోసం హాస్టల్ సౌకర్యం ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇస్తే ఎంతో నైపుణ్యం కలిగిన క్రీడాకారులు తయారవుతారు. అలాగే క్రీడాకారుల కోసం మంచి శిక్షణ పొందిన కోచ్‌లను కూడా నియమించాలి. 2శాతం ఉన్న స్పోర్ట్స్ కోటాను 3శాతానికి పెంచి ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి నిర్ణయం తీసుకున్నారు. దీని వల్ల ఎంతో మంది క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుంది. స్మార్ట్‌సిటీ నిధులు రూ.18 కోట్లతో నిర్మించిన మల్టీపర్పస్ కన్వర్టబుల్ స్టేడియం వినియోగంలోకి తీసుకువస్తే క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే త్వరలో జరగనున్న నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు కూడా కాకినాడ వేదికగా నిలిచే అవకాశాలున్నాయి.

-చుండ్రు గోవిందరాజులు, సీఈవో, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్

ప్రతీ మ్యాచ్‌ను నిశితంగా పరిశీలిస్తాం



మ్యాచ్ మొదలైన దగ్గర నుంచి చివరి వరకు క్రీడాకారులు వేసే గోల్స్‌ను చాలా నిశితంగా పరిశీలిస్తూనే ఉంటాం. మా నుంచి ఎటువంటి చిన్న పొరపాటు జరిగిన క్రీడాకారులు ఆయా జట్టు ఎంతో నష్టపోతాయి. అందుకనే ప్రతీ గోల్‌ను క్లీన్‌గా అబ్జర్వ్ చేస్తాం. టెక్నికల్ అఫీషియల్‌గా మ్యాచ్ మధ్యలో జరిగే గొడవల విషయంలో కూడా చాలా సమన్వయంతో క్రీడాకారులను కంట్రోల్ చేస్తూ మ్యాచ్‌ను ముందుకు తీసుకెళ్లాల్సి వస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో మ్యాచ్ మధ్యలో లోకల్ పర్సన్స్ వచ్చి గొడవలు సృష్టిస్తుంటారు. అలాంటి సందర్భాల్లో పరిస్థితులు క్లిష్టంగా మారుతుంటాయి. అటువంటి సందర్భాల్లో పరిస్థితులు బట్టి ఫస్ట్ వార్నింగ్‌కు గ్రీన్‌కార్డు, క్రీడాకారులను కావాలని ఇబ్బంది పెడితే ఎల్లో కార్డు, క్రీడాకారుల మధ్య గొడవలు జరిగితే రెడ్‌కార్డు ఉపయోగించి క్రీడాకారులను మ్యాచ్ నుంచి బయటకు పంపిస్తాం.

-ఎం.అశోక్‌రెడ్డి, సీనియర్ టెక్నికల్ అఫిషియల్, ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ హాకీ

అంతరంగం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో మంత్రి దుర్గేష్, మాజీ మంత్రి డొక్కా, మాజీ ఎంపీ ఉండవల్లి, రచయిత శ్రీపాద

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విషయ పరిజ్ఞానంతో సాహిత్య పరంగా సాగే రచనలు ఉత్తమ సమాజ నిర్మాణానికి ప్రేరణగా నిలుస్తాయని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రచయిత శ్రీపాద శ్రీనివాస్ స్వీయ అనుభవాలతో రూపొందించిన అంతరంగం సంకలనాన్ని శనివారం స్థానిక ప్రకాశం నగర్ బుక్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన సభకు దుర్గేష్‌తోపాటు మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ శ్రీపాద శ్రీనివాస్ హైదరాబాదులో సీఎల్పీ ఉద్యోగిగా, నాడు తనకు శాసన మండలిలో ఎంతో విషయ పరిజ్ఞానంతో విషయాలు అందించేవారని గుర్తు చేశారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీపాద రచనల్లో సహజత్వం ఉట్టి పడుతుందన్నారు. ఈ సందర్భంగా శ్రీపాదను సత్కరించారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, రౌతు సూర్యప్రకాశరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, సీసీసీ ఛానల్ ఎండీ పంతం కొండలరావు, వక్కలంక నాగేంద్ర, అత్తిలి జగన్నాథం, చింతపెంట ప్రభాకర్, రామినీడి మురళి, షేక్ అసదుల్లా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉమాదేవికి రెండున్నర కిలోల వెండి చీర



వెండి చీరలో ఉమాదేవి అమ్మవారు

ఆలమూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారంలోని ఉమా మూలేశ్వరస్వామి ఆలయంలోని ఉమాదేవి అమ్మవారికి వెండి చీరను భక్తులు బహూకరించారు. గ్రామానికి చెందిన పేరూరి మహేందర్‌నాథ్ దంపతులు రూ.3లక్షల విలువగల రెండున్నర కిలలో వెండితో తయారు చేయించిన తయారు చేయించిన చీరను శనివారం ప్రత్యేక పూజలు చేయించి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంఎస్ఆర్.కృష్ణ చేతుల మీదుగా మహేంద్రనాథ్ దంపతులు అందించి అమ్మవారికి అలంకరించారు. వెండి చీరను బహూకరించిన మహేంద్రనాథ్ దంపతులను పలువురు అభినందించారు.

భక్తవత్సల గోవిందా!

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.51.61 లక్షలు



ఆత్రేయపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘ శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్ర పుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాల భోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాం స్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పలు సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.51.61 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఇదిలా ఉండగా స్వామిని బుల్లితెర నటీ వర్షి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వర్షాతో భక్తులు సెల్ఫీలు తీసుకున్నారు.

హెచ్‌ఎం వేధింపులతో ఉపాధ్యాయురాలి ఆత్మహత్యాయత్నం


అమలాపురంలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయురాలు లావణ్య

- అమలాపురం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యా యురాలు
- తోటి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నిరసన
- హెచ్‌ఎం పాఠశాలలో ఉంటే మేం...పాఠాలు చెప్పలేం
- హెచ్‌ఎంను వెంటనే బదిలీ చేయాలని ఉపాధ్యాయుల పట్టు
- విచారణ అనంతరం చర్యలు ఉంటాయని డీఈవో ప్రకటన

పి.గన్నవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మన హెచ్‌ఎం వేధింపులు నేను భరించలేను... నేను వెళ్లిపోతున్నాను అంటూ ఉదయం తన నివాసం నుంచి వీడియో కాల్‌లో తోటి ఉపాధ్యాయులకు చెబుతూ ఆత్మహత్యకు పాల్పడిన ఓ ఉపాధ్యాయురాలి వీడియో కాల్‌లో ఉన్న తోటి ఉపాధ్యాయులు, ఆమె భర్త అప్రమత్తం కావడంతో ప్రాణాలతో బయటపడి అమలాపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో ఆ ఉపాధ్యాయురాలు పనిచేస్తున్న ముంగండ హైస్కూల్లో తోటి ఉపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాల ఆవరణలో బైఠాయించి హెచ్‌ఎంకు వ్యతిరేకంగా నిరసనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి.... అమలాపురానికి చెందిన డీఎస్‌డీ లావణ్య 2023జూన్‌లో ముంగండ హైస్కూల్లో బయోలాజికల్ ఉపాధ్యాయురాలిగా వచ్చారు. ఈక్రమంలో గత కొంతకాలంగా తరుచూ హెచ్‌ఎం జి.కనకదుర్గ వేధింపులకు గురిచేస్తుందని తీవ్ర వత్తిడికి గురవుతున్నానని తోటి ఉపాధ్యాయులతో చెప్పుకుంటూ వచ్చింది. ఈనేపథ్యంలో తోటి ఉపాధ్యాయుల గ్రూప్‌కు వీడియోకాల్ చేసి నేను వెళ్లిపోతున్నానని చెప్పి ఆత్మహత్యకు పాల్పడింది. వీడియోలో గమనించిన ఉపాధ్యాయులు అమలాపురంలోనే ఉన్న మరో ఉపాధ్యా యుడిని, భర్త మున్సిపాలిటీలో పనిచేస్తున్న ప్రసాద్‌ను అప్రమత్తం చెయ్యడంతో ఉరి వేసు కోవడానికి ప్రయత్నిస్తున్న లావణ్యను కిందికి దించారు.


ముంగండ హైస్కూల్లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాల నాయకులు

అస్వస్థతకు లోనడడంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విష యం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాల నేతలు ముంగండ చేరుకుని నిరసన ప్రారంభించారు. హెచ్‌ఎంను వెంటనే బదిలీ చేయాలని లేకపోతే ఉపాధ్యా యులందరినీ ఈ స్కూలు నుంచి బయటకు పంపించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకుని డీఈవో సలీంబాషా ఆదేశాలమేరకు అక్కడకు చేరుకున్న డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు, ఎంఈవోలు కె.హెలీనా, సిహెచ్ వీరభద్రానందం, మోకా ప్రకాష్, కె.వెంకటేశ్వ రరావులు ఉపాధ్యాయులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. పాఠశాల ఉపాధ్యాయుల కార్యదర్శి మేథ్స్ టీచర్ కోట సత్యనారాయణ మాట్లాడుతూ హెచ్‌ఎం కనకదుర్గ 2023లో ముంగండ పాఠశాలకు వచ్చారని అప్పటి నుంచి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆత్మహత్యకు పాల్పడిని లావణ్య గతంలో రెండుసార్లు హెచ్‌ఎం వేధింపులకు తీవ్ర వత్తిడికి గురై గర్భస్రావం కూడా జరిగినట్లు చెప్పారని తెలిపారు. ఆత్మహత్య విషయం హెచ్‌ఎం దృష్టికి తీసుకువెళితే ఇదంతా డ్రామా అనిచెప్పి తోసిపుచ్చారని మండిపడ్డారు. ఆమెను బయటకు పంపి శాఖాపరమైన చర్యలు తీసుకునే వరకు విద్యార్థులకు పాఠాలు చెప్ప బోమని ఉపాధ్యాయులు తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని హనుమంతరావు డీఈవో దృష్టికి తీసుకువెళ్లగా హెచ్‌ఎంను పది రోజులు సెలవుపై వెళ్లాలని అప్పటివరకు ఇన్‌చార్జ్ హెచ్‌ఎంను నియమించాలని విచారణ అనంతరం చర్యలు ఉంటాయని ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌ఎం సెలవుపై వెళ్లడంతో ఉపాధ్యాయులు నిరసన విరమించి క్లాస్‌రూమ్‌లకు వెళ్లారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు పోతంశెట్టి దొరబాబు, నాగిరెడ్డి శివప్రసాద్, సరిదే సత్యపళ్లంరాజు, ఎంటీయూ సుబ్బారావు, పింకే వెంకటేశ్వరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ముంగండ ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ

నిబంధనలు పాటించడం వేధింపులా

- హెచ్‌ఎం జి.కనకదుర్గ

ప్రభుత్వ నిబంధనలు అనుసరించి నడుచుకోమనడం వేధింపుల్లా ఉన్నాయని హెచ్‌ఎం జి.కనకదుర్గ అన్నారు. ముంగండ పాఠశాలకు వచ్చే సరికి విద్యార్థులు బాగా వెనుకబడి ఉన్నారని వారిని గాడిలో పెట్టేందుకే ప్రయత్నం చేస్తున్నానని ఆ తరహా పనులు ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. వెనుకడిన విద్యార్థులకు అక్షరాలు నేర్పమంటే తప్పా అని ఆమె ప్రశ్నించారు. ఏ పాఠశాలలోను ఈరకమైన చర్యలు తీసుకోవడంలేదని మీరు ఎందుకు చేస్తున్నారని ఉపాధ్యాయులు నన్ను ప్రశ్నించారని ఆమె వాపోయారు. ఉపాధ్యాయురాలు ఆత్మహత్యకు నాకు సంబంధంలేదని ఏకారణాలు వలన చేసుకున్నారో తెలియదనిఆమె స్పష్టం చేశారు.

శుభకార్యానికి వెళుతూ ... రోడ్డు ప్రమాదం

- వేగాయమ్మపేట వద్ద విరిగిన మినీ వ్యాను యాక్సిల్.. ఊడిన చక్రం
- వ్యానులో వెళుతున్న 39 మందికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం




కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న జాలెం వీరవేణి,ఏరియా ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న క్షతగాత్రులు, ప్రమాదానికి గురైన వ్యాను

ద్రాక్షారామ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శుభకార్యానికి వెళుతున్న 39 మంది గాయపడ్డారు. అందులో ఒక మహిళపరిస్థితి విషమంగా ఉంది. మండలంలో తోటపేట శివారు గాంధీనగర్‌కు చెందిన 40మంది మసకపల్లిలో జరిగే శుభకార్యానికి వ్యానులో వెళుతుండగా ప్రయాణిస్తున్న వ్యాను వెనుక యాక్సిల్ విరగడంతో కుడివైపు చక్రం ఊడిపడి ప్రయాణిస్తున్న వారు గాయపడ్డారు. పోలీసులు, క్షతగాత్రులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం11 గంటల ప్రాంతంలో గాంధీనగర్‌కు చెందిన 33 మంది వరకు మహిళలు, ముగ్గురు పురుషులు, ఇరువురు బాలురు, ఒక బాలిక మసకపల్లిలో జరిగే శుభకార్యానికి అశోక్ లైలాండ్ మినీ వ్యానులో బయలు దేరారు. బయలుదేరిన కొద్ది నిమిషాల్లో గాంధీనగర్ దాటి వేగాయమ్మపేట చర్చి ప్రాంతానికి చేరేసరికి మినీ వ్యాను వెనుక కుడివైపు చక్రం యాక్సిల్ విరిగిపోయింది. దీంతో చక్రం ఊడిపడింది. వ్యాను అదుపుతప్పి వ్యానులో ప్రయాణిస్తున్న వారు ఒకరిపై ఒకరు పడ్డారు. వ్యాను కొంతదూరంవరకు వెళ్లడంతో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్సుల్లో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటన తెలుసుకున్న మంత్రి సుభాష్ కూటమి నాయకులు, ఏరియా ఆసుపత్రి వైద్యులను అప్రమత్తం చేశారు. క్షతగాత్రులు రెండు అంబులెన్సులు, మరో రెండు వాహనాల్లో ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. అప్పటికే ఏరియా ఆసుపత్రికి చేరుకున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, గొల్లపల్లి కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంలు ఆసుపత్రి సిబ్బంది క్షతగాత్రులను వాహనాల నుంచి ఆసుపత్రిలో చేర్చారు. సూపరింటెండెంట్ డా.ప్రవీణ్, వైద్యులు, సిబ్బంది 39 మంది క్షతగాత్రులకు బెడ్‌లు కేటాయించి ప్రథమ చికిత్స అందించారు. క్షతగాత్రుల్లో జాలెం వీరవేణికి తలకు తీవ్రగాయాలు కావడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అల్లంపల్లి భారతి చేయి విరగడంతో కాకినాడలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను ఆర్డీవో అఖిల, డీఎస్పీ రఘువీర్‌లు పరామర్శించారు.

బావిలో పడి వ్యవసాయ కూలీ మృతి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) ప్రమాదవశాత్తూ వ్యవసాయ పొలంలోని బావిలో పడి వ్యవసాయ కూలి మృతి చెంది న సంఘటన శనివారం సాయంత్రం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామంలో జరిగింది. పోలీసులు అం దించిన సమాచారం మేరకు.. పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన అంకం సుబ్రహ్మణ్యం (48) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో శనివారం బావిలో నీరు తోడుతుండగా ప్ర మాదవశాత్తూ బావిలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సుబ్రహ్మణ్యం భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తునిలో చిన్నారిపై అత్యాచారయత్నం

తునిరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తుని పట్టణంలో దారుణం చోటుచేసుకుంది. పట్టణలో ఓ కుటుంబం కూలి పనికి వెళ్లగా అదే కుటుంబానికి చెందిన ఐదేళ్ళ చిన్నారిని తుని పట్నానికి చెందిన ఓ యువకుడు కేక్ కొనిస్తానన్నాడు. ఐదేళ్ల చిన్నారిని నమ్మబలికి అత్యాచారానికి యత్నించినట్లు బాలిక తల్లి దండ్రులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు ఫోక్స్ యాక్ట్‌తోపాటుగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసునమోదు చేసినట్లు సీఐ వివరించారు.

భక్తుల సౌకర్యాలపై దృష్టి పెట్టాలి

- అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు

అన్నవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ఆదాయ మార్గాల అన్వేషణ కంటే భక్తులకు సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం ప్రకాష్‌సదన్ పాలకమండలి సమావేశపుహాలులో దేవస్థానం ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రధానంగా ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐవీఆర్‌ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం చివరిస్థానంలో ఉండడంతో దీనిని మెరుగుపరిచేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ అన్నవరం దేవస్థానం అధికారులందరితో సమావేశమవుతున్నందున ప్రతి విభాగ సిబ్బంది పూర్తిసమాచారంతో ఉండాలని సూచించారు. ప్రధానంగా రత్నగిరిపై షాపు లీజుదారులు భక్తులపట్ల అమర్యాదగా, చిరాకుగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు అధికంగా ఉన్నాయని లీజుదారులు హద్దుమీరితే చర్యలు తీసుకోవాలన్నారు. వ్రతపురోహితులు సైతం భక్తులపట్ల వ్యవహరించే తీరుపై వారి సందేహాలను నివృత్తిచేయడంలో సరిగా పనిచేయడంలేదని పనితీరు మార్చుకునేవిధంగా వ్రతవిభాగ అధికారులు దృష్టిపెట్టాలని అన్నారు. అదేవిధంగా సౌకర్యాల కల్పన విషయంలో పశ్చిమరాజగోపురం ఎదురుగా దాత సహకారంతో నిర్మించ తలపెట్టిన షెడ్డును ఈవేసవి సమీపించేలోపు పూర్తిచేయించాలని సిబ్బంది ఈవోకు సూచించారు. మరోపక్క మరుగుదొడ్లు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సత్రంగదుల నిర్వహణపై ఎప్పటికప్పుడు, దుప్ప ట్లు మార్చడం, నీటి కష్టాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, ఏఈ వోలు శ్రీనివాస్, కొండలరావు, ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, నూకరత్నం, సూపరిం టెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, అనకాపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.


పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం ఒకదాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విశాఖపట్టణానికి చెందిన గేదెల వరలక్ష్మి ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. అల్లూరిజిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం సమీపంలో జరిగిన ప్రమాదంలో ఒడిశావాసి మృతిచెందాడు. అలాగే కాకినాడజిల్లా సామర్లకోట మండ లం మేడపాడు వద్ద బైక్ అదుపుతప్పి ఒక వ్యక్తి మృతి చెందాడు. తొండంగి మండలం అన్నయ్యపేటవద్ద బీచ్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు.

టాటా మ్యాజిక్ వాహనం ఢీకొని ఒడిశా వాసి మృతి


ప్రమాదంలో మృతి చెందిన బజారి

ఎటపాక, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న స్కూటీని టాటా మ్యాజిక్ వాహనం ఢీకొన్న ఘటనలో ఒడిశావాసి మృతి చెందాడు. ఈసంఘటన శనివారం అల్లూరిజిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం సమీపంలో విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రం మల్కాజ్‌గిరి జిల్లా బీనాయక్‌పూర్ గ్రామంనకు చెందిన పండా బజారి (38)తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలో పేయింటింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామంకు వెళ్లిన అతను ఈనేపథ్యంలో తిరిగి స్కూటీపై బీనాయక్‌పూర్ నుంచి భద్రాచలం వస్తున్నాడు. భద్రాచలంవైపు నుంచి ఏడుగురాళ్ల పల్లి వెళ్తున్న టాటా మ్యాజిక్ లక్ష్మీపురం గ్రామ శివారులోని మలుపువద్ద ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బజారి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడ దుర్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్‌సైకిల్ నుంచి పడి వ్యక్తి మృతి

సామర్లకోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా సామర్లకోట మండలం జీ.మేడపాడు కెనాల్ రోడ్లో వేట్లపాలెం- జీ.మేడ పాడు గ్రామాల మధ్య వేగంగా వెళుతున్న మోటార్‌సైకిల్ నుంచి అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలు అయ్యి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. సామర్లకోట రాజీవ్ గృహకల్ప వద్ద నివాసం ఉంటున్న పెద్దాపురం నారాయణ కళాశాలలో పీఆర్వోగా పనిచేస్తున్న నగరం సత్తిబాబు(42) సామర్లకోట నుంచి మోటార్ సైకిల్‌పై తన అత్తగారిల్లు అయిన పెద్దబ్రహ్మదేవం వెళుతుండగా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం సమీపాన అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు అందించిన సమాచారంతో సామర్లకోట పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని అతని వద్ద లభించిన చిరునామా మేరకు సామర్లకోటలో ఉన్న కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌లు ఢీకొని యువకుడి మృతి


రోడ్డు ప్రమాదంలో మరణించిన యువకుడు

తొండంగి, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం అన్నయ్యపేటవద్ద బీచ్ రోడ్డుపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒంటిమామిడి గ్రామానికి చెందిన దారాబాల రాజు (18) దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజు తన బావను వేమవరం వద్ద దింపేందుకు హంటర్ స్పోర్ట్స్ బైక్‌పై వెళ్లి దింపి తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో ఒంటిమామిడి వైపు నుంచి అన్నయ్యపేట వైపు రాయల్‌ఎన్‌ఫీల్డ్ వాహనంపై వెళ్తున్న గరికిన రాము, రాజు స్పోర్ట్స్ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో తుని ఏరియా ఆసు పత్రికి తరలించగా దారాబాల రాజు అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. గరికిన రాము కాలు విరిగింది. రాజు తాపీ పని చేసేవాడు. తొండంగి హెడ్ కానిస్టేబుల్ పాండురంగ కేసు నమోదు చేశారు.

'లోవ' క్షేత్రానికి అంతర్జాతీయ గుర్తింపు

తునిరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి అంతర్జాతీయ గుర్తింపు లభించినట్టు ఆలయ ఈవో పి.విశ్వనాధ్‌రాజు తెలిపారు. తిరుపతిలో 3 రోజులపాటు జరిగిన ఇంటర్నేషనల్ టెంపుల్ సమ్మిట్‌లో రాష్ట్రంలో పలు ఆలయాలతో పాటుగా తలుపులమ్మ ఆలయంపై వివరించి ప్రదర్శించామన్నారు. 150 దేశాల ప్రతినిధులు లోవ ఆలయాన్ని సందర్శించారని ఈవో వివరించారు.


తలుపులమ్మ లోవ ప్రాంగణం

రాష్ట్రంలో ప్రప్రథమంగా ఆలయంలో ఎక్స్‌లేటర్ ఏర్పాటు, ఆలయ పునః నిర్మాణ పనులపై సమ్మిట్‌లో వివరించామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ కోరుతూ సైకిల్ యాత్ర

- 29,650 కిలోమీటర్లు యాత్ర పూర్తిచేసిన ముత్తుసెల్వన్


సైకిల్‌యాత్ర చేస్తున్న ముత్తుసెల్వన్

మామిడికుదురు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోరుతూ తమిళనాడులోని కొయంబత్తూరుకు చెందిన ముత్తుసెల్వన్ ఆసియా దేశాల్లో సైకిల్ యాత్ర చేపట్టాడు. ఎనిమిది ఆసియా దేశాల్లో యాత్ర చేసే విధంగా 2021 డిసెంబరు 21న యాత్రకు శ్రీకారం చుట్టి ఇప్పటివరకు మూడు దేశాల్లో 29,650 కిలోమీటర్లను 1150 రోజుల్లో పూర్తిచేశారు. బంగ్లాదేశ్, నేపాల్‌తోపాటు ఇండియాలో సైకిల్‌యాత్ర పూర్తయిందని, ఇండియాలో పూర్తవుతుందన్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్ లేక అనేకమంది మరణాలు సంభవించడం చూసి చెట్లు నాటే విధంగా ఈ యాత్రను నిర్వహిస్తున్నానని, ప్రతీ గ్రామంలోను చెట్లు నాటే విధంగా స్థానిక అధికారులతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. 44వేల కిలోమీటర్లతో తన యాత్ర పూర్తవుతుందని, 2027 డిసెంబరు 21 నాటికి యాత్రను పూర్తి చేస్తానని తెలిపారు. సెల్వన్ శనివారం మామిడికుదురు చేరుకుని నగరం ఎస్‌ఐ చైతన్యకుమార్, తహశీల్దార్ సుబ్రహ్మణ్యాచార్యులను కలుసుకుని యాత్ర విశేషాలను తెలిపాడు.

చోరీ కేసుల్లో ఐదుగురి అరెస్టు

కడియం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా కడియం మండలంలోని పలు గ్రామాల్లో చోరీలకు పాల్పడిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కడియం పోలీసుస్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ భవ్యకిషోర్ వివరాలను వెల్లడించారు. జేగురుపాడులో జి.సత్యవతి గుడికి వెళ్లి వస్తుండగా ఇద్దరు దుండగులు ఆమె నోరు మూసి మెడలో బంగారు మంగళసూత్రాలు లాక్కుపోయినట్టు కడియం పోలీసులకు ఫిర్యాదు అందింది. అలాగే జేగురుపాడు, మురమండ, బుర్రిలంక, దుళ్ల గ్రామాల్లో చోరీలు జరిగినట్టు ఫిర్యాదులొచ్చాయి. వీటిపై సీఐ ఎ.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ బీఎస్ దుర్గాప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. నల్లజర్ల మండలం అవుపాడు గ్రామంలో ఉంటున్న మాధవరాయుడుపాలేనికి చెందిన కొత్తపల్లి త్రిమూర్తులు, పిఠాపురం మండలం విరవాడకు చెందిన కూరాకుల సుబ్బారావు, కపిలేశ్వరపురం మండలం వల్లూరులో ఉంటున్న మాధవరాయుడుపాలేనికి చెందిన గాదంశెట్టి వెంకన్న, మండపేట మండలం కేశవరానికి చెందిన పచ్చ రాజు, రామచంద్రపురం బాడీపేటకు చెందిన గుమ్మడి సత్యనారాయణమూర్తిలను అరెస్టు చేశారు. అలాగే మండపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి రెండు, రాజానగరం స్టేషన్‌కు సంబంధించి నాలుగు చోరీ కేసు ల్లో సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి 58 గ్రాముల బంగారు ఆభరణాలు, జత వెండి పట్టీలు, ఓ బైక్, కాపర్‌వైరు, రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం విలువ సుమారు రూ.5,40,000 ఉంటుందని డీఎస్పీ తెలిపారు.

కాశీ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు


పాడె మోస్తున్న టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, శరత్

అమలాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారులు సాత్విక్‌సాయిరాజ్ తండ్రి రంకిరెడ్డి కాశీవిశ్వనాథం అంతిమయాత్ర శనివారం జరిగింది. గాంధీబజార్‌లోని ఆయన స్వగృహంవద్ద నుంచి వందలాది మంది క్రీడాభిమానులు, పురప్రముఖులు, జాతీయ అసోసియేషన్‌ల ప్రతినిధులు, అంతర్జాతీయ క్రీడాకారులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. గాంధీబజార్ నుంచి ప్రత్యేక వాహనంలో కాశీవిశ్వనాథం భౌతికకాయాన్ని ఉంచి అంతిమ యాత్రను ప్రారంభించారు. మాచిరాజువీధి, రవణంవీధి, గుండువీధి మీదుగా మెయిన్‌రోడ్డుకు చేరుకుని అక్కడి నుంచి ఆయన కళల సౌధమైన ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌కు చేరుకుంది. అక్కడ కొద్దిసేపు కాశీ భౌతికకాయాన్ని ఉంచారు. అక్కడి నుంచి మార్కెట్‌లోని హిందూ శ్మశానవాటికకు తరలించారు. మార్కెట్ ఏరియా నుంచి కాశీ భౌతికకాయాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అసోసియేషన్ ప్రతినిధి అల్లాడ శరత్ తదితరులు పాడెని మోశారు. అంతిమయాత్రలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ కార్యదర్శి పున్నయ్యచౌదరి, ఏపీపీఏ కార్యదర్శి అంకమ్మచౌదరి, టెక్నికల్ పర్సన్ ప్రసాద్, సాత్విక్‌సాయిరాజ్ జోడి అయిన చిరాగ్‌శెట్టి, అంతర్జాతీయ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్, కోచ్ టోని, ప్రముఖులు నల్లా పవన్‌కుమార్, చిక్కాల గణేష్ తదితరులు పాల్గొన్నారు. అంతిమయాత్ర అనంతరం సాత్విక్‌సాయిరాజ్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతోపాటు పలువురు ప్రముఖులు పరామర్శించారు.

భార్యను కత్తితో నరికి చంపిన భర్త అరెస్టు

కొవ్వూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కత్తితో భార్యను నరికి చంపిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లి బంగారమ్మపేటలో భార్య, మామపై కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో దాడిచేసిన కేసులో నిందితుడిని గంద్ర మురళీకృష్ణచౌదరిని శనివారం కొవ్వూరు పాత రైలు వంతెన (హేవలాక్ బ్రిడ్జి) వద్ద అరెస్టు చేశామన్నారు. ఈనెల 20న కుటుంబ తగాదాల నేపథ్యంలో బంగారమ్మపేటకు చెందిన గంద్ర కృష్ణతులసి (37)ను భర్త ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రాజుగూడెంనకు చెందిన గంద్ర మురళీకృష్ణచౌదరి కత్తితో నరకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అడ్డువచ్చిన కృష్ణతులసి తండ్రి అడ్డాల నాగేశ్వరరావును కత్తితో దాడిచేసి గాయపర్చాడు. దీనిపై మృతురాలి సోదరుడు అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా శనివారం గంద్ర మురళీకృష్ణచౌదరిని కొవ్వూరు పట్టణంలోని పాత రైలు వంతెన వద్ద అరెస్టుచేసినట్లు సీఐ విశ్వం తెలిపారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చామన్నారు.

జీజీహెచ్‌లో మరో జీబి సిండ్రోమ్ కేసు

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 22 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జీజీహెచ్‌లో మరో గులియన్- బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైనట్లు ఆసుపత్రి న్యూరాలజీ ఇన్‌చార్జ్ హెచ్‌వోడి డా. ఎండీ షరీఫ్ తెలిపారు. శనివారం నమోదైన కేసుతో కలిపి మొత్తం ఐదుగురు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. తీవ్రమైన నీరసం, కాళ్ళుచేతులు తిమ్మిర్లు, కండరాల బలహీనత, జ్వరం, శ్వాసకోస సమస్యలు, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలు కనబడితే ఆందోళన చెందకుండా సంబంధిత అర్హుడైన వైద్యుడిని సంప్రదించాలన్నారు. జీజీహెచ్‌లో జీబీఎస్ కేసులకు సంబంధించి వైద్య చికిత్స, మందులు, మౌళిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉన్నాయన్నారు.

రసవర్గాల కొనుగోలుపై ఫుడ్‌సేఫ్టీ క్వాలిటీ పరిశీలన

అన్నవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో వివిధ అవసరాలకు కొనుగోలుచేసే రసవర్గాలైన గోదుమలు, పప్పులు, పంచదార, తదితర సరుకుల నాణ్యతకు సంబంధించి శనివారం ఆహారనియంత్రణ (ఫుడ్ సేఫ్టీ) అధికారులు పర్యవేక్షణ చేశారు. ఈనెల 27న వీటి కొనుగోలుకు టెండర్లు పిలవనున్న నేపథ్యంలో ఏ రకాలు నాణ్యతగా ఉంటాయి వాటి ధరలు ఏవిధంగా ఉంటాయి అనే దానిపై సెంట్రల్‌స్టోర్స్ అధికారులు వారిని అడిగి తెలుసుకున్నారు. టీటీడీలో నెయ్యి వినియోగంపై ఆరోపణలు రావడంతో అప్పటి నుంచి అన్నవరం దేవస్థానం కొనుగోలుచేసే ముడిపదార్థాలను, అన్నిరకాల వస్తువులను వీరు తనిఖీ చేపట్టిన తరువాతనే కొనుగోలు చేస్తున్నారు. దేవస్థానంలో వీటి కొనుగోలుకు సంబంధించి ప్రతి ఆరు నెలలకు టెండర్లు పిలిచి దేవదాయకమిషనర్ ఆమోదంతో క్వాలిటీ వస్తువులు తక్కువ ధరకు టెండర్ కోడ్ చేసినవారికి సరఫరాకు అనుమతిస్తారు. ఆహార నియంత్రణ అధికారులు సుబ్బారావు, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బి పనుల్లో లోపాలు ఉంటే రికవరీ చేస్తాం

- ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటేశ్వరరావు

పి.గన్నవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ పనులు నాణ్యతలో లోపాలు ఉంటే సంబంధిత కాంట్రాక్టర్ నుంచి డబ్బులు రికవరీకి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ సీఈ జి.వెంకటేశ్వరరావు అన్నారు. పి.గన్నవరం-అమలాపురం ఏజీ రోడ్డులో సీసీ రోడ్డు నాణ్యతను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌అండ్‌బీకి సంబంధించిన 100 పనులు పూర్తయ్యాయని వాటిని క్వాలిటీ కంట్రోల్ పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ప్రతి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పరిశీలన చేసి వాటి క్వాలిటీలో లోపా ల తీవ్రతను బట్టి కొన్ని చోట్ల డబ్బులు రికవరీచేస్తే మరికొన్ని చోట్ల మరమ్మతులకు సూచనలు చేస్తామన్నారు. కొన్నిచోట్ల ఆయా ప్రాజెక్టును బట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తామన్నారు. ఇటీవలే పూర్తయిన ఆర్‌అండ్‌బీ సీసీ రోడ్లు, బీటీ రోడ్లను క్వాలిటీ కంట్రోల్ బృందం అధికారులు పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సీఈతోపాటు క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ జీవీ భాస్కరరావు, ఈఈ జి.శ్రీనివాస్‌నాయక్, డి.ఈ హరిప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జి.కాంతు, ఈఈ బి.రాము, డీఈ జి.రాజేంద్ర, జేఈ మణి కుమార్, సిబ్బంది ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సెలూన్లు, పార్లర్లలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు హెచ్చరించారు. అమలాపురంలోని ఏడు అత్యాధునిక సెలూన్లు, పార్లర్లను శనివారం పట్టణ ఎస్ఐ కిశోర్ బాబుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు

ముమ్మిడివరం,ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి):సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మతల్లి వార్షిక మహోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి పూజలునిర్వహించారు. శుక్రవారం రాత్రికుమార్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో జబర్దస్తకామెడీషో, సినీగాయనీగాయకులు సాకేత్, శ్రీనివాస్, సత్యయామిని, వాగ్దేవి, రైజింగ్ రాజు, దొరబాబు, హరిత గీతాలు ఆలపించారు.

ఉద్యోగుల కోసం ప్రతీ నెల సంక్షేమ కార్యక్రమాలు : జేసీ

అమలాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రతీ నెల ఏదో ఒక కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. సర్వేంద్రియానం నయనం ప్రధానం అని ఉద్యోగులు విధి నిర్వహణలో దృష్టి లోపాలను పట్టించుకోకపోవడం వల్ల భవిష్యత్తులో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. కలెక్టరేట్ ఉద్యోగుల సంక్షేమాన్ని కాంక్షించి కలెక్టరేట్‌లో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా జేసీ ప్రారంభించారు. ఉద్యోగులకు కంటి వైద్య పరీక్షలు, బీపీ, మధుమేహం వైద్య పరీక్ష



కలెక్టరేట్‌లో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జేసీ నిషాంతి

లను జిల్లా వైద్య విధాన్ పరిషత్ వైద్యాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అంధత్వాన్ని నివారించేందుకు చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జేసీ సూచించారు. కళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరికీ ఉందన్నారు. వయోభారం, మధుమేహం, విటమిన్ లోపాలతో కంటి సమస్యలు ఎక్కువగా వస్తాయన్నారు. పోషకాహారం తీసుకుంటూ తగినంత నిద్ర పోవాలని సూచించారు. అంధత్వ నివారణ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ ఎ.హేమలత, జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి, పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఉప తహశీల్దార్లు బి.చినబాబు, వంశీ, శివరాజ్, భరత్, రవితేజ పాల్గొన్నారు.

బాలబాలాజీస్వామికి విశేష పూజలు



బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి అనంతరం తొలిహారతి ఇచ్చారు. దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వైనతేయ నదిలో స్నానమాచరించి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. శనివారం స్వామివారిని 4,500మంది దర్శించుకున్నారని, 2800మంది అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ అర్జిత సేవల ద్వారా రూ.3,36,920 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

బాలబాలాజీని దర్శించుకున్న మంత్రి

అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని శనివారం కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహింపచేసి వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ సిబ్బంది మంత్రిని దుశ్శాలువాలతో సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొంతు భాస్కరరావు, తులా శ్రీను, పాటి గోవిందు, ఆలయ సిబ్బంది బొక్కా సత్యంమూర్తి, మొల్లేటి రమేష్, మొల్లేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పెద్దింట్లమ్మ ఉత్సవాలు



అంతర్వేది, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం, మెండుపాలెంలో వెలసి ఉన్న శ్రీపెద్దింట్లమ్మవారి ఉత్సవాలు ఈనెల28 నుంచి మార్చి 28వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఉత్సవాల నిర్వహణ ప్రతీ ఏటా స్థానిక గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగేవి. వారి మధ్య విబేధాలు రావడంతో శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయనే ఉద్దేశంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకాధికారి నిర్వహణలో ఉత్సవాలు నిర్వహించాలని అమలాపురం ఆర్డీవో మాధవి ఆదేశాలు జారీచేశారన్నారు. రెండు వర్గాల వారు అమ్మవారి ఉత్సవాలకు సహాయ సహకారాలు అందించాలని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఉత్సవాలకు వేలమంది భక్తులు విచ్చేస్తారని, అమ్మవారి ఉత్సవాల నిర్వహణ విషయంలో ఆటంకాలు కలిగించినా, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నెలరోజుల పాటు జరిగే అమ్మవారి ఉత్సవాలకు పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. స్వలాభం కోసం సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. 22మంది ఇరువర్గాల వారికి ముందస్తు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. ఎస్ఐలు బి.రాజేష్‌కుమార్, కె.దుర్గాశ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాల్లో భాగస్వాములు కావాలి

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా స్వచ్ఛ గ్రామాల్లో భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి అన్నారు. స్వచ్ఛ జిల్లాగా కోనసీమను తీర్చిదిద్దేందుకు జరుగుతున్న కృషిలో ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పేరూరు పంచాయతీలో ఇంటింటా జరుగుతున్న చెత్త సేకరణ కార్యక్రమాన్ని డీపీవో పరిశీలించారు. సిబ్బందితో పాటు ప్రజలకు పలు సూచనలు చేశారు. తడిచెత్త-పొడి చెత్తను సేకరించి సంపద సృష్టించే కేంద్రాలకు తరలించాలన్నారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు స్వచ్ఛతే లక్ష్యంగా పనిచేస్తున్న అధికారులకు ప్రజలు పూర్తి సహకారం అందించి ఇళ్ల వద్ద చెత్తను బుట్టల ద్వారా అందించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి వేగుళ్ల వెంకటరామన్ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం: పేరూరులో చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి

శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

అల్లవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి ఆదేశించారు. బోడసకుర్రు పంచాయతీ పరిధిలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో తడి చెత్త, పొడిచెత్త సేకరణపై సిబ్బందికి సూచనలు చేశారు. పలుచోట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ యు.నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి ఎస్.దుర్గాశ్రీనివాస్ పాల్గొన్నారు. అల్లవరంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.రాజమోహన్ ఆధ్వర్యంలో తడి, పొడిచెత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సంపద తయారీపై అవగాహన

రాజోలు, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): గ్రామంలో చెత్త నుంచి సంపదను తయారు చేయు విధానంపై రాజోలులో కార్యదర్శి రెహ్మాన్ సమక్షంలో ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సర్పంచ్ రేవు జ్యోతి మాట్లాడుతూ ప్రతీ ఇంటికీ చెత్త బండిని తిప్పి పొడిచెత్త-తడిచెత్త వేరుచేయు విధానంపై అవగాహన కల్పించి, చెత్తనుంచి సంపదను తయారు చేయు విధానంపై ప్రజలకు వివరించారు.

నేడు పార్వతీరామేశ్వర కల్యాణం

అల్లవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): త్రేతాయుగంలో శ్రీరామునితో శివలింగ ప్రతిష్ఠతో పురాణ ప్రసిద్ధి పొందిన సామంతకుర్రు పరిధిలోని ఎస్.రామేశ్వరంలో ఆదివారం రాత్రి పార్వతీ రామేశ్వరస్వామి కల్యాణం జరుగుతుందని చైర్మన్ అంగాని రామారావు తెలిపారు.

వీవోఏలకు శిక్షణ తరగతులు

రాజోలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజోలు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు గ్రామసంఘాల వివరాలు, లోగోస్ అప్లికేషన్ ద్వారా నమోదు, ప్రాథమిక సమాచారం ఆర్థిక లావాదేవీల నమోదుపై సీసీలకు వీవోఏలకు రెండు రోజులు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయని ఏపీఎం భూపతివర్మ తెలిపారు. ఈసందర్భంగా డీఆర్డీఏ రాజోలు ఏరియా క్లస్టర్ పరిధిలోని రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి, పి.గన్నవరం మండలాలకు చెందిన వీవోఏలు, సీసీలకు జిల్లా టీవోలు డి.వరాలుబాబు, జి.దుర్గాప్రసాద్, ఈఎంటీ కాశింబి శిక్షణ ఇచ్చారు.

ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించండి

కూటమి నాయకుల ప్రచారం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. ఈనెల27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలో రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు. శనివారం పేరూరు, గున్నేపల్లి అగ్రహారం, సాకుర్రు, ఇందుపల్లి, బండారులంక, నడిపూడి, పాలగుమ్మి, జనుపల్లి, నల్లమిల్లి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పట్టభద్రులైన ఓటర్లను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు మల్లుల పోలయ్య, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, యెరుబండి వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి-బాబ్జి, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మంథా పణికుమార్, కూటమి నాయకులు లింగోలు పండు, తిక్కా సరస్వతి, పిచ్చిక శ్యామ్, మంద గెద్దయ్య, నల్లా వెంకటేశ్వరరావు, మోటూరి బాలాజీ, పనసా బుజ్జి, ఉర్రింక బుజ్జి, కాశిన చినబాబు, కొండా రాజు, ఏకుల విజయ్, గుమ్మిడి బ్రహ్మాజీ, మాజీ సర్పంచ్‌లు నడింపల్లి ఉదయ్‌బాబు, దంగేటి వెంకటేశ్వరరావు, చొల్లంగి సత్యసాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం: పేరూరులో పట్టభద్రులను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అభివృద్ధిని చూసి ఓటేయండి

మామిడికుదురు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలంటూ పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. శనివారం పాశర్లపూడి, పాశర్లపూడిలంక, ఆదుర్రు, లూటుకుర్రు, నగరం గ్రామాల్లోని హైస్కూల్స్‌లో ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, బండారు శ్రీనివాసరావు, షేక్ సుభాన్, మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, భైరిశెట్టి రామకృష్ణ, బోనం బాబు, సూదా బాబ్జి, దొంగ సత్తిబాబు, మల్లాడి విష్ణు, గంధం భాస్కర్, ముఖర్రం హుస్సేన్, విళ్ల సుబ్బారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శాసనమండలికి పంపాలి

మలికిపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో శాసనమండలికి పంపాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శంకరగుప్తం, పడమటిపాలెం, మోరి తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. ప్రతీఒక్కరూ రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు. మాజీమంత్రి పీతల సుజాత ఎన్నికల ప్రచారంలో పలు గ్రామాల్లో విస్తృతంగా పాల్గొన్నారు. రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసేలా ఓటర్లకు చెప్పాలన్నారు. గూడపల్లిలో బీజేపీ నాయకులు రాజశేఖర్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీలు ఎంవీ సత్యవాణి, కేతా శ్రీను, భూపతిరాజు సాయిబాబురాజు, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, చింతా వీరభద్రేశ్వరరావు, అడబాల సాయిబాబు, గెద్దం మహాలక్ష్మిప్రసాద్, కాకి లక్ష్మణ్, చెల్లుబోయిన శ్రీనివాస్, వీరా రామారావు, గుబ్బల ఫణి, అనుచూరి పురుషోత్తం, పిండి వెంకటమోహనరావు, ఆకుల చినవెంకన్నాయుడు, ముప్పర్తి సత్యశ్రీనివాస్, గూడపల్లిలో బీజేపీ నాయకులు అడబాల సత్యనారాయణ, ఎంవే వేమా, మాలే శ్రీనివాసనగేష్, మేడిచర్ల చాణక్య, కె.కనకేశ్వరరావు పాల్గొన్నారు.

శివకోడులో ఎన్నికల ప్రచారం

రాజోలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజు ఆధ్వర్యంలో శివకోడులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురుకుల బాలికల పాఠశాల, నారాయణ జూనియర్ కళాశాల, నారాయణ పాఠశాల, రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తాటిపాకలో వేలాసిటి విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులను కలిసి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, రాజోలు టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నార్కేడుమిల్లి విష్ణువర్ధన్, దొంగ శివకిరణ్, యల్లమిల్లి నాగేంద్ర, నిమ్మకాయల శేషు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యతా ఓటువేయాలి

అంతర్వేది, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మోరి, మోరిపోడు, శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం గ్రామాల్లో బండారు శ్రీనివాస్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఎమ్మెల్సీ ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జి, గెద్దం మహాలక్ష్మిప్రసాద్, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, చాగంటి స్వామి, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడండి

శివరాత్రి ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీవో మాధవి, డీఎస్పీ ప్రసాద్



మురమళ్లలో శివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి, డీఎస్పీ ప్రసాద్

ఐ.పోలవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ సూచించారు. మురమళ్ల శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లను శనివారం వారు పరిశీలించారు. దర్శనానికి ఎన్నివేల మంది భక్తులు వస్తారని అనుకుంటున్నారని ఆమె ఆలయ అధికారులను అడిగారు. తాగునీరు, ప్రసాదం, వైద్యశిబిరం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆర్డీవో అన్నదానసత్రాన్ని, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఆఖరి రోజున మురమళ్ళ పవిత్ర గోదావరిలో జరిగే తెప్పోత్సవంపై ఆరా తీశారు. తహశీల్దార్ చిక్కాల విజయశ్రీ, ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్, ఎస్ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి, ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

గజఈతగాళ్లను అందుబాటులో ఉంచండి

కాట్రేనికోన, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కుండలేశ్వరం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని ఆర్డీవో కె.మాధవి అధికారులకు సూచించారు. డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్‌తో కలిసి శనివారం కుండలేశ్వరంతో పాటు పలు ప్రాంతాలను ఆమె సందర్శించారు. పుష్కరఘాట్‌కు వెళ్లి అక్కడ అధికారులతో మాట్లాడారు. గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ట్రాఫిక్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ క్రిందిస్థాయి అధికారులకు సూచించారు. తహశీల్దార్ సునీల్‌కుమార్, సీఐ మోహన్‌కుమార్, ఎస్ఐ అవినాష్, ఆర్ఐ సత్యవేణి, వీఆర్వోలు ఏసురత్నం, భూలక్ష్మి పాల్గొన్నారు.

కవలల దినోత్సవం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కవలల దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరం బాలాజీ విద్యాసంస్థల్లో ఎనిమిది కవల జంటలను సత్కరించారు. స్కూలుయాజమాన్యం కవలలకు చాక్లెట్లు, పెన్నులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కరస్పాండెంట్ సుజాత, మేనేజర్ పీవీఎస్ శాస్త్రి, హెచ్ఎం పీవీ రామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

డీఈవో షేక్ సలీంబాషా



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే దివ్యాంగ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా సూచించారు.ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో శనివారం సహిత విద్య సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సహిత విద్యపై సమీక్షా సమావేశంలో డీఈవో మాట్లాడారు. భవిత కేంద్రాల్లో ఎన్రోల్మెంట్ పెంచేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సహితవిద్య సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టబోయే సహిత విద్య కార్యక్రమాల గురించి వివరించారు. సహితవిద్యలో ఉత్తమ ఉపాధ్యాయులుగాఎంపికైన ఆర్.రమాదేవి, ఎం.స్వర్ణలతలను ప్రత్యేకఉపాధ్యాయుల యూనియన్, డీఈవో సత్కరించారు.

చెరువుల తవ్వకాలు ఆపాలని మత్స్యకారుల ఆందోళన

అల్లవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం శివారు సీతారామపురం-రామేశ్వరం సరిహద్దుల భూముల్లో చెరువుల తవ్వకాలు ఆపాలని రామేశ్వరానికి చెందిన మత్స్యకారులు ఆందోళన చేశారు. చెరువుల తవ్వకాల పనులను అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా చెరువులు తవ్వుతున్నారని, అధికారులు న్యాయం చేయాలంటూ నినాదాలుచేశారు. రామేశ్వరానికి చెందిన చక్కా సత్తిబాబు, మత్స్యకార సమితి జిల్లా ఉపాధ్యక్షుడు అంగాడి శ్రీను, కర్రి చిన్నయ్య, చెక్కా ఆంజనేయులు, అంగాడిసత్యశ్రీనివాస్, ఎస్ఎస్ఎస్ వైద్యవిభాగ జిల్లా అధ్యక్షుడు అంగాడి ధనుంజయవర్మ, చెక్కా నరసింహమూర్తి, లంకే కుమారస్వామి, కొల్లు ధర్మారావు, చెక్కా రాజు మత్స్యకారులు చెరువుల వద్ద తవ్వకాలు అడ్డుకుని ఆందోళన చేశారు.

'గురుకులం'లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

పి.గన్నవరం, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి):నరేంద్రపురం గురుకుల పాఠశాలలో 2025-26 ఏడాదికి 5వ తరగతి, ఇంటర్మీడియట్లలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.వేణు తెలిపారు. 5వ తరగతిలో 80, ఇంటర్ మొదటి ఏడాది సీఈసీ గ్రూపు-40, ఎంఈసీ గ్రూపు-40 సీట్లుఉన్నాయన్నారు.ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు. మార్చి 6వరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మార్చి 6వరకు దరఖాస్తులకు గడువు

రాజోలు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజోలు గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి.లలితకుమారి తెలిపారు. ఈసందర్భంగా బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 5వ తరగతి ఇంగ్లీషు మాధ్యమం 85 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ఎంపీసీ గ్రూపునకు 40 సీట్లు, బైపీసీ 40 సీట్లు ఉన్నాయన్నారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరీక్షల ద్వారా విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా మార్చి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే గొల్లపల్లి పర్యటన

యానాం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాశ్ అశోక్ శనివారం యానాం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యాటించారు. నియోజకర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ఫెర్రీరోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న రోడ్లు, యానాం లోగో పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావలని అధికారులకు సూచించారు. సుబ్రదనగర్‌లోని రోడ్లు, శ్మశానవాటిక మరమ్మతు పనులు పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట ప్రజాపనుల శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయలో రాబర్ట్ జయంతి వేడుకలు

యానాం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్, గైడ్స్ వ్యవస్థాకుడు సర్ రాబర్ట్ బేడెన్‌పౌల్ జయంతిని పురస్కరించుకుని థింకింగ్ డే వేడుకలను స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సి.రాజశేకర్‌రెడ్డి స్కౌట్ పతాకాన్ని ఎగురవేసి సర్ రాబర్ట్ బేడెన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం స్కౌట్ మాస్టర్ డి.పాపారావు ఆధ్వర్యంలో స్కౌట్, గైడ్స్ విద్యార్థులు ఆలపించిన గీతాలు వివిధ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్.సాంబశివరావు, లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన

పి.గన్నవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నివారణ వారోత్సవాలు పురస్కరించుకుని నరేంద్రపురం గురుకుల పాఠశాలలో పి.గన్నవరం టీబీ యూనిట్, పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సా విధానం, ప్రభుత్వం నుంచి క్షయవ్యాధి గ్రస్తులకు అందించే సహకారం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.వేణు, టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ జి.సర్వారాయుడు, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీహెచ్ఏ బి.రాజారావు, గురుకుల పాఠశాల హెల్త్ సూపర్‌వైజర్ ఎం.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ముమ్మిడివరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలేనికి చెందిన విశ్రాంత గెజిటెడ్ హెచ్ఎం పితాని వీరవెంకటసత్యనారాయణ శనివారం మురమళ్ల జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు పుస్తకాలను వితరణగా అందించారు. ఆరు నుంచి పదో తరగతి వరకు మొదటి మూడు ర్యాంకులు సాధించిన 80మంది విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామర్, తెలుగుగ్రామర్, ఇంగ్లీషు, తెలుగు డిక్షనరీలు, జనరల్ నాలెడ్జ్, వ్యాసావళి పుస్తకాలు అందించారు. మండలస్థాయి సైన్స్‌ఫేర్‌లో బహుమతులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు పుస్తకాలను అందించారు. ఈసందర్భంగా వీరవెంకటసత్యనారాయణను హెచ్ఎం మట్టపర్తి శ్రీనివాస్ అభినందించారు.

పోలీసు వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవలందిస్తా



అంబాజీపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవలు అందించి, లా అండ్ ఆర్డర్‌పై మంచి పట్టు సాధిస్తానని ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి అన్నారు. అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో భాగంగా కొత్తపేట సబ్‌డివిజన్‌కు ఎంపిక అయ్యాయన్నారు. ఇప్పటి వరకు తాను కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్ఐగా కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పనిచేసినట్టు తెలిపారు. అంబాజీపేట పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా తొమ్మిది వారాలు శిక్షణ పొందుతానన్నారు. కేసుల నమోదు, దర్యాప్తు వంటి వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుంటానన్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన తాను ఎక్సైజ్ శాఖలో ఎస్ఐగా పనిచేసినట్లు తెలిపారు.

నేడు యానాంలో వేట కథలు సదస్సు

● హాజరుకానున్న ప్రముఖ కవులు

యానాం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): యానాం సర్వశిక్ష అభియాన్ సమావేశపు హాలులో ఆదివారం సాహిత్య అకాడమీ- స్ఫూర్తి సాహితీ సమాఖ్య యానాం సంయుక్త నిర్వహణలో వేటకథలు-సదస్సు అంశంపై సమావేశం నిర్వహిస్తామని ప్రముఖ కవి, స్ఫూర్తి సాహితీ సమాఖ్య యానాం అధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు తెలిపారు. సమావేశానికి సాహిత్య అకాడమీ సభ్యుడు చింతకింది శ్రీనివాసరావు స్వాగతోపన్యాసం, అధ్యక్షోపన్యాసం సాహిత్య అకాడమీ కన్వీనర్ సి.మృణాళిని చేస్తారు. ముఖ్యఅతిథిగా యానాం పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, గౌరవ అతిథిగా దాట్ల దేవదానంరాజు హాజరవుతారు. కార్యక్రమంలో కవులు రత్నాకర్ పెనుమాక, వరుగు భాస్కరెడ్డి, వాసిరెడ్డి నవీన్(అల్లం శేషగిరిరావు కథలు), అవధానుల మణిబాబు (జెపి వైద్య కథలు), శైలజ, జె.నీరజ(పతంజలి కథలు), మందపర్తి కిశోర్ (పూసపాటి కృష్ణంరాజు కథలు), అద్దేపల్లి ప్రభు (ఇతర రచయిత వేట కథలు) తదితరులు పాల్గొంటారు.

దర్గాను దర్శించుకున్న పుల్లెల గోపీచంద్



ముమ్మిడివరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇండియన్ బ్యాడ్మింటన్ చీఫ్, నేషనల్ కోచ్ పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత పుల్లెల గోపీచంద్ శనివారం ముమ్మిడివరం మండలం కొత్తలంకలోని వలీబాబా దర్గాను దర్శించుకున్నారు. వలీబాబా దర్గా ముజావర్ గేదెల రఘునాథ్‌బాబా గోపీచంద్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వలీబాబాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

స్కౌట్ విద్యార్థుల ర్యాలీ

అయినవిల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు లార్డ్ బేడెన్ పావెల 168వ జయంతిని శనివారం ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు వివిధ కృత్యాలు నిర్వహించారు. స్కౌట్ ఉద్యమ ఆశయాలు, లక్ష్యాలు సాధిస్తామని విద్యార్థులతో స్కౌట్ టీచర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పెచ్చెట్టి శ్రీనివాస్, స్కూలు కమిటీ చైర్మన్ యడ్ల లక్ష్మీదుర్గ, స్కౌటు టీచర్ డి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్కౌట్ అండ్ గైడ్ యూనిట్ ప్రారంభం

పి.గన్నవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం హైస్కూల్లో స్కౌట్అండ్ గైడ్‌యూనిట్‌ను హెచ్ఎం డీఎస్‌వీప్రసాద్ శనివారం ప్రారంభించారు. హెచ్ఎం స్కార్ఫ్, కాప్‌లు విద్యార్థులకు అందించి స్కౌట్ పతాకాన్ని ఆవిష్కరించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. స్కౌట్ కెప్టెన్ ఎం.దుర్గాప్రసాద్, గైడ్ కెప్టెన్ కె.సుభాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారత స్కౌట్ వ్యవస్థాపకుడి జయంతి

అంతర్వేది, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మోరి జానసుబ్బమ్మ జిల్లాపరిషత్ హైస్కూల్‌లో భారత స్కౌట్స్ గైడ్స్ వ్యవస్థాపకుడు లార్డ్‌రాబిట్‌ఇన్ పావెల్ జయంతి సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీధర్‌కృష్ణ స్కౌట్ పతాకాన్ని శనివారం ఎగురవేశారు. అనంతరం పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి సేవాతత్వం అలవరచుకోవాలన్నారు. అంతర్వేది కల్యాణోత్సవాల్లో సేవలందించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు.

ఘనంగా పాళ్లమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

మామిడికుదురు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): లూటుకుర్రులో పాళ్లమ్మ అమ్మవారి పునఃప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా శనివారం పలు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గోకవరపు గణాధిపతి, లక్ష్మీసరోజ, గోకవరపు పెరుమాళ్లస్వామి, శ్రీవిద్య దంపతులు కర్తలుగా పాల్గొని విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య మార్జనలు, వాస్తుపూజ, వాస్తు హోమం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా చేశారు. ఆదివారం ఉదయం 11.50గంటలకు శ్రీపాళ్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, అనంతరం భారీ అన్నసమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కొత్తలంక పచ్చమట్లవారిపాలేనికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వీపూరి వీరవెంకటసత్యనారాయరాజు(70) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. సొసైటీ అధ్యక్షుడిగా, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడిగా, కొత్తలంక పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా పదవులు నిర్వహించారు. సత్యనారాయణరాజుకు భార్య రామలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు టీడీపీ పతాకాన్ని రాజు భౌతికకాయంపై ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. గుత్తుల సాయి, గేదెల రఘునాథబాబా, నడిమింటి సూర్యప్రభాకరం, ఎంపీటీసీ చంద్రరావు, దాసరి సాయిబాబు, గొలకోటి దొరబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

పోలీసుల విధులకు ఆటంకం: వ్యక్తి అరెస్టు

కాట్రేనికోన, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చెయ్యేరుకు చెందిన కాపు ఉద్యమ నాయకుడు, ఆక్వా రైతు రాష్ట్ర సంఘం సలహాదారు త్సవటపల్లి నాగభూషణంను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ప్రభలఉత్సవంలో ఆర్కెస్ట్రాలో మహిళా కళాకారులు నృత్యం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్థానికులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన నాగభూషణం తమతో వాగ్వివాదానికి దిగారని, దురుసుగా ప్రవర్తించడమే కాకుండా విధులకు ఆటంకం కల్గించారని పోలీసులు ఆయనపై 361,126(2), 132,292,296,351(3), రెడ్‌విత్ 190, 49బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేశారు. శనివారం ఆయనను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా, కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

విజేతలకు బహుమతి ప్రదానం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు శనివారం బహుమతులందించారు. ఈపోటీల్లో కొమరగిరి జడ్పీ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని మహాలక్ష్మి, మురమళ్ళ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కావ్య, 8వ తరగతి విద్యార్థిని పవిత్ర, వడ్డిచెరువు పాఠశాల విద్యార్థిని కీర్తన జిల్లా స్థాయిలో విజయం సాధించారు. ఎంఈవో కొండారెడ్డి వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వీధి సురేష్‌బాబు, యూవీ వెంకట్రావు, వరద శ్రీనివాస్, పాపారావు, అనురాధ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ బహూకరణ

ఐ.పోలవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పితాని వీరవెంకటసత్యనారాయణ శనివారం విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. ఆరు నుంచి పది తరగతుల వరకు మొదటి మూడు ర్యాంకులు సాధించిన 30మందికి జనరల్ నాలెడ్జ్, తెలుగు, ఇంగ్లీషు గ్రామర్ పుస్తకాలు అందించారు. 25ఏళ్లుగా ఆయన ఏటా క్రమం తప్పకుండా పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. హెచ్ఎం మట్టపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైన్సుఫెయిర్‌తో మేధస్సు పెంపు

అంబాజీపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సైన్సుఫెయిర్ నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో మేధస్సు మరింత పెరుగుతుందని ప్రిన్సిపాల్ సిస్టర్ సునీమల్ అన్నారు. ఇరుసుమండ సెయింట్ జోసెఫ్ ఇంగ్లీస్ మీడియం హైస్కూల్‌లో సిస్టర్ రెనీ ఆధ్వర్యంలో సైన్సుఫెయిర్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు పలు ప్రాజెక్టులు తయారుచేసి ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్సు ఎగ్జిబిషన్ అందర్ని ఆకట్టుకుంది. పంచాయతీ కార్యదర్శి ఆర్.ఏడుకొండలు చంటి, బలుసు శ్రీనివాస్, సిస్టర్ అభిష, డాక్టర్ డి.కుమార్, ఆర్.ప్రసాద్, ఎన్.సత్యానందం పాల్గొన్నారు.



గోదావరి జలాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

ఆలమూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారంలోని షిర్డిసాయిబాబా ఆలయ 19వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరిపారు. ముందుగా షిర్డీసాయికి వివిధ 40 రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం వందలాది మంది మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి గోదావరి జలాలను 108 బిందెలతో తీసుకొచ్చి వాటితో అభిషేకం జరిపించారు. సాయినాథుడి విగ్రహానికి పూల మాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం నుంచి భజనలు, భక్తి గీతాలను ఆలపించారు. షిర్డిసాయిని దర్శించుకునేందుకు మూలస్థాన అగ్రహారం గ్రామస్తులతో పాటు మండలంలోని పలు గ్రామాల షిర్డీ సాయి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యత, సేవలపై ఆర్డీవో సంతృప్తి



ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీవో అఖిల

ద్రాక్షారామ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యత, శుభ్రత, సేవలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆర్డీవో అఖిల తెలిపారు. శనివారం రామచంద్రపురంలోని అన్న క్యాంటీన్ లు ఆర్డీవో అఖిల, మున్సిపల్ కమీషనర్ అయ్యప్ప నాయుడుతో కలసి పరిశీలించారు. క్యాంటీన్‌లో ఆహారం తింటున్న పలువురిని వారు పలుకరించారు. ఆహార నాణ్యతపై అధిక శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారని వారు తెలిపారు. పరిశుభ్రత, నాణ్యతపై మరింత శ్రద్ధ పెట్టాలని మరికొంత మంది సూచించారని వారు తెలిపారు.

పెనుగొండ వాసవీమాత ఆలయానికి వాహనాలు సిద్ధం

మండపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ వాసవీ మాత అమ్మవారి ఆలయ ట్రస్టు నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు మండపేటకు చెందిన వాసా శ్రీనివాసరావు పలు వస్తువులను తయారు చేశారు. ఎనిమిది నెలల క్రితం ఆలయ నిర్వాహకుల ఆర్డర్ మేరకు అమ్మవారికి ఇత్తడితో చేసిన శేష, సింహ, పందిరి, నంది వాహనాలను ఇత్తడితో చేసి శనివారం నిర్వాహకులకు అందించామని శిల్పి శ్రీనివాసరావు తెలిపారు. వీటి తయారీకి 7 నెలలు పట్టిందని, రూ.15 లక్షల వ్యయం అయిందని తెలిపారు.



అమ్మవారికి తయారు చేసిన వాహనాలు

ఉపాధి కూలీలతో కాలువపూడిక తొలగింపు

ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించిన అధికారులు

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచర, నాగులచెరువు, ఆయకట్టు పరిధిలోని వరిపొలాలకు సాగు నీరందకపోవడంతో బీటలువారాయి. దీంతో ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. శ్రీరాంపురం బ్యాంక్ కెనాల్ నుంచి నాగులచెరువు వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు, తుప్పలతో మూసుకుపోయిన కాలువకు ఉపాధికూలీలతో తొలగించి నీటిపారుదలకు ఆటంకం లేకుండా చేశారు. రోజుకు సుమారు 25 నుంచి 25 మంది ఉపాధి కూలీలతో కాలువ పూడికలను తొలగించి శనివారానికి పూర్తి చేసినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ శివకృష్ణ తెలిపారు. వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కాలువను శుభ్రపరుస్తున్న ఉపాధి కూలీలు

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



టీడీపీ క్యాంపు కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రావులపాలెం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను నిరంతరం పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు అప్రమత్తంగా ఉం డాలన్నారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీ గణేష్‌కుమార్, వాసిరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మంత్రి సుభాష్ పరామర్శ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వ్యాను ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శనివారం రాత్రి ఏరియా ఆసుపత్రిలో మంత్రి సుభాష్ పరామర్శించారు. వైద్య సదుపాయాలు అందుతున్న తీరును సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కూటమి నాయకులు రవ్వా భూషణం, కాటే సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అంతకు ముందు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ క్షతగాత్రులను పరామర్శించారు. ఆయన వెంట ఐడీబీఐ మాజీ డైరెక్టరు శ్యామ్, వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారాం ఉన్నారు.

క్షతగాత్రులకు వాసంశెట్టి సత్యం ఆర్థికసాయం: వేగాయమ్మపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గాంధీనగర్‌కు చెందిన క్షతగాత్రులకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున 40 మందికి శనివారం రాత్రి అందించారు. కార్యక్రమంలో ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఆర్.భూషణం పాల్గొన్నారు.

ద్వారపూడి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని వినతి

మండపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ద్వారపూడి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ మండపేట మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌ను కోరారు. ద్వారపూడి రైల్వేస్టేషన్ సమస్యలపై ఎమ్మెల్యే వేగుళ్ల కూడా ఎంపీతో మాట్లాడారు. టీడీపీ కార్యాలయంలో ద్వారపూడి సమస్యలపై ఎంపీ ఆరా తీయగా రైల్వేస్టేషన్ వున్న సమస్యలపై బాబ్జి తెలిపారు. ద్వారపూడిలో కోణార్క్, భావనగర్, మన్మాడ్, జన్మభూమి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లకు స్టేజీ ఇవ్వాలని కోరారు. కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకు వెళతానని ఎంపీ తెలిపారు.

స్కౌట్ విద్యార్థులంతా లక్ష్యంతో పనిచేయాలి

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్కౌట్ విద్యార్థులంతా లక్ష్యంతో పనిచేస్తూ ప్రజల మన్ననలను పొందాలని మాచర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.రమాదేవి అన్నారు. శనివారం మాచర ఉన్నత పాఠశాలలో ప్రపంచ స్కౌట్ అండ్ గైడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాలలోని 32 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తూ సేవా కార్యక్రమాలకు పునరంకితమయ్యేలా చేస్తున్నట్లు తెలిపారు. తొలుత స్కౌట్ అండ్ గైడ్స్ ఉద్యమానికి ఆద్యుడు రాబర్ట్ స్టీఫెన్ స్మిత్ బేడెన్ పవేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఎంపిక కాబడ్డ విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ రాయుడు ఉదయ్‌కుమార్, గైడ్స్ మాస్టర్ మందా శిరోమణి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గమ్మ తీర్థం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అంగర చేనేత సొసైటీ సమీపంలో ఉన్న విజయదుర్గమ్మ ఆలయం వద్ద శనివారం అమ్మవారి తీర్థం జరిగింది. భక్తులు, గ్రామస్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆదివారం అమ్మవారికి నైవేద్యాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.





మధ్యలో నిలిచిపోయిన మండపేటలోని గొల్లపుంతకాలనీలో వున్న ప్రభుత్వ పాఠశాల భవనం. పక్క చిత్రంలో అద్దె భవనంలో పాఠశాల నిర్వహిస్తున్న దృశ్యం

అటకెక్కిన నాడు-నేడు భవనం పనులు

• గొల్లపుంతకాలనీలో పాఠశాల దుస్థితి • విద్యార్థులకు తప్పని పాట్లు

మండపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తామని చెప్పిన గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో చేపట్టిన నాడు-నేడు పాఠశాల పనులు చాలా చోట్ల ఎక్కడ వేసిన గొంగలి అన్న చందాన తయారయ్యాయి. మండపేటలోని 20వ వార్డులో వున్న వేగుళ్ల వీర్రాజు ఎంపీపీ యూపీ స్కూల్ 2 తరగతి గదులతో నడుస్తున్నది. ఇక్కడ విద్యార్థులు 157 మంది వరకు వున్నారు. ఇక్కడ 2 తరగతి గదులు, వరండా వున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులు చాలకపోవడంతో ఉపాధ్యాయులు రెండేళ్ల నుంచి సొంత నిధులను చందాలుగా వేసుకుని పాఠశాలకు సమీపంలోని ఇంటిని అద్దెకు తీసుకున్నారు. అందులో 5, 1, 2 తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మాత్రం 6, 7, 3, 4 తరగతులను నిర్వహిస్తున్నారు. చాలీచాలని తరగతి గదులతో పాటు ఇరుకు గదుల మధ్య విద్యార్థులు చదువుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకంలో పాఠశాల భవనం నిర్మాణానికి సంబంధించి రూ.9.5 లక్షలు మంజూరు కాగా వాటి నిధులు కేవలం పునాదిస్థాయికే సరిపోయాయి. ప్రస్తుతం నాడు-నేడు భవనం పూర్తి కాకపోవటంతో ఉపాధ్యాయులు పాఠశాలకు అదనంగా అద్దె భవనాన్ని తీసుకుని తరగతులు నిర్వహిస్తున్నారు. గతంలో విద్యార్థులకు మున్సిపల్ దుకాణ సముదాయం రేకుల షెడ్డులో నిర్వహించేవారు. అక్కడ తరగతులు నిర్వహిస్తే పిల్లలను పంపబోమని తల్లిదండ్రులు చెప్పటంతో చేసేదేమీలేక ఉపాధ్యాయులు చందాలు వేసుకుని రెండేళ్ల నుంచి అద్దె భవనంలో అదనపు తరగతి గదుల్లో పాఠశాలను నిర్వహిస్తున్నారు. మరోవైపు వంటశాల కూడా చాలకపోవడంతో బియ్యాన్ని భద్రపరుచుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వంటశాలలో పాడైన వాటర్ ఫిల్టర్‌లు, మోటారు బోర్ ఉండటంతో వంట చేసేవారు పలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్య దృష్ట్యా ఇక్కడి అవసరాలను గుర్తించి త్వరితగతిన నాడు-నేడు పాఠశాల భవనం పనులు పూర్తి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.1.97 లక్షలు

కొత్తపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,97,520 ఒకరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



శాకాంబరిగా అలంకరించిన దృశ్యం

శివరాత్రి వేడుకలు ప్రారంభం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వసంతవాడ పార్వతీ పరమేశ్వరుల పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు శివరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు. శనివారం విఘ్నేశ్వరుని పూజ, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, కూరగాయలతో శాకంబరీగా అలంకరించారు. మార్చి 1వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించి పూర్ణాహుతి, పుష్పోత్సవంతో ముగియనున్నాయి. ర్యాలీ ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఏర్పాట్లు చురుకుగా నిర్వహిస్తున్నారు.

విద్యతోపాటు క్రీడలు అవసరమే

కొత్తపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. క్రీడల వల్ల మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చునని పేర్కొన్నారు. శనివారం భాష్యం విద్యా సంస్థల ఆధ్వర్యంలో భాష్యం స్కూల్ విద్యార్థుల ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌వీ గాంధీ, జోనల్ ప్రిన్సిపాల్ జేవీ శ్రీనివాస్, ఎం.లోకేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరాబత్తులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం





మండపేటలోని ఏడిదలో ప్రచారం చేస్తున్న అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల, రాష్ట్ర కార్యదర్శి పరిశీలకుడు రమేష్. పక్క చిత్రంలో రావులపాలెంలో ప్రచారం చేస్తున్న ఎంపీతోపాటు ఎమ్మెల్యే బండారు తదితరులు

ఆలమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం కోసం కూటమి నాయకులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆలమూరు మండలం పినపళ్లలో ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు అధ్వర్యంలో పట్టభద్రుల వద్దకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజశేఖర్‌ను గెలిపించాలని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ గణేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆత్రేయపురంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు ఆధ్వర్యంలో కూటమి నేతలతో ప్రచారం చేశారు. పట్టభద్రుల ఇంటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. మహాత్మాగాంధీ ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి రాజశేఖర్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పీఎస్ రాజు, బీజేపీ మహిళా నేత కాలాబత్తుల చిన్నారి తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ, అంకంపాలెం, వెలిచేరు, పేరవరం తదితర గ్రామాల్లో కూటమి నేతలు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరం విజయానికి కృషి చేయాలని అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పార్టీ పరిశీలకుడు రాజనరమేష్ తెలిపారు. ఏడిదలో ఎమ్మెల్యే వేగుళ్ల, ఎంపీ, స్థానిక నేతలు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. గ్రాడ్యుయేట్ ఓటర్లతో పాటు సచివాలయాల ఉద్యోగులు, ఉపాధ్యాయులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో టీడీపీ మండల అధ్యక్షుడు వై.బాబ్జి, ఏడిద టీడీపీ అధ్యక్షుడు పర్వతిన వీర్రాజు, కూటమి నేతలు వున్నారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజశేఖర్‌ను గెలిపించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు కోరారు. వానపల్లిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పి.గణేష్‌కుమార్, కంఠంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజశేఖర్‌ను గెలిపించాలని ఎంపీ హరీష్‌మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. రావులపాలెంలో ఎంపీ, ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి పట్టభద్రుల ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీ గణేష్‌కుమార్, నాయకులు తునిగెల రఘురామ్, వాసిరెడ్డి రాంబాబు, ఆకుల రామకృష్ణతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.



వీరరాఘవులుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మెల్సీ అభ్యర్థి వీరరాఘవులుకు మద్దతుగా ప్రచారం

రాయవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పీడీఎఫ్ తరపున పోటీ చేస్తున్న దిడ్ల వీరరాఘవులుకు మద్దతుగా శనివారం రాయవరంలో సీఐటీయూ నేతలు ప్రచారం నిర్వహించారు. రాయవరంలో సీఐటీయూ నాయకుడు బి.బలరాం మాట్లాడుతూ 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీరరాఘవులుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులు క్రమశిక్షణ, సేవా భావం అలవర్చుకోవాలి

రాయవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు సేవాభావం అలవర్చుకోవాలని ఎంఈవో-2 వై.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్‌డే సందర్భంగా స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం వి.శాంతి సునిత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడారు. ఈసందర్భంగా విద్యార్థులు స్థానిక ఉన్నత పాఠశాల నుంచి గ్రామంలో ర్యాలీ చేశారు. అనంతరం అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామానికి చెందిన దాత కర్రి వెంకట సత్యనారాయణరెడ్డి ఆర్థిక సహాయంతో సమకూర్చిన స్కౌట్ యూనిఫాంను పాఠశాలకు చెందిన 37 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, స్కౌట్ మాస్టర్ దేవరకొండ సుబ్బారావు, గైడ్ కెప్టెన్ బి.లిల్లీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దంగేరులో స్కౌట్ ర్యాలీ

కె.గంగవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్కౌట్ వ్యవస్థాపకుడు రాబర్ట్ బెడెన్ పోవెల్ జయంతిని పురస్కరించుకుని దంగేరులో పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేశారు. పాఠశాలకు ఈ విద్యా సంవత్సరంలో స్కౌట్ యూనిట్ మంజూరైంది. ఈ సందర్భంగా విద్యార్థులు సేవకు సిద్ధం అంటూ నినాదాలు చేసి తమ సేవాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో2 చోడిశెట్టి అంజనేయులు, ప్రధానో పాధ్యా యుడు నేదునూరి రాజు, స్కౌట్ గౌడ్ టీచర్ గంగవరాజు, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో తడిపొడి చెత్తపై గొల్లపుంతకాలనీలోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రంగారావు



రాయవరంలో తడిపొడి చెత్త వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక డ్రైవ్

కె.గంగవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో తడిపొడి చెత్త సేకరణ చేశామన్నారు. ఆదివారం కూడా ఈ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగవుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): గోపాలపురంలో ప్రత్యేక పారిశుధ్య పనులలో భాగంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ సబ్బిత మోహన రావు, కార్యదర్శి నిమ్మకాయల సాయిరామ్ సిబ్బందితో కలిసి గ్రామంలో తడిపొడి చెత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

స్వచ్ఛ మండపేట దిశగా అడుగులు

మండపేట(ఆంధ్రజ్యోతి): ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో స్వచ్ఛ మండపేట సాధిస్తామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు చెప్పారు. మండపేటలో శనివారం 20వ వార్డు పరిధిలోని గొల్లపుంత కాలనీ వాసు లకు ఆయన తడిపొడిచెత్తపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంజనీర్ లు పవన్‌కుమార్, ఆంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తిరాజు తదిత రులు వున్నారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): తడిపొడిచెత్త వేరుచేసే విధానంపై ప్రజ లకు అవగాహన కల్పించాలని ఈవోపీఆర్డీ కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం రాయవరంలో తడి , పొడిచెత్త వేరుచేసే విధానంపై పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. ఆదివారం నుంచి తడి పొడి చెత్త వేరుచేసి సేకరించాలని తెలిపారు.



కపిలేశ్వరపురంలో తడిపొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పరిశుభ్రత పాటించాలి

కపిలేశ్వర పురం(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలని ఈవోపీఆర్డీ ఎం.మోహన్ అన్నారు. శనివారం కపిలేశ్వరపురంలో తడి, పొడిచెత్తపై ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన కార్యదర్శి కె.శివ చక్రవర్తితో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో జె.మల్లిఖార్జునుడు, వైద్య, ఆరోగ్య, సచివాలయ, సిబ్బంది, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

మండపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) ఈనెల 21, 22 తేదీల్లో జరిగిన అంతర్ జిల్లాల టెన్నికాయిట్ మహిళా, పురుషుల చాంపియన్‌షిప్ క్రీడా పోటీలు తూర్పుగోదావరి జిల్లా చిట్యాల గ్రామంలో జరిగాయి. ఈ పోటీల్లో మండపేటకు చెందిన క్రీడాకారలు పిల్లి రామారావు, వడ్డాది వినయ్‌కుమార్, ఎల్. త్రిమూర్తులు, ఒకటి, మూడు, స్థానాలు సాధించారని కాకినాడ జిల్లా టెన్నికాయిట్ అసోషియేషన్ కార్యదర్శి కుంచే రమేష్ చెప్పారు. విజేతలైన క్రీడాకారులు మార్చి 25 నుంచి, 29 వరకు ఒడిశాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఏపీ టెన్నికాయిట్ అసోషియేషన్ అధ్యక్షుడు వై.డి.రామారావు తెలిపారు. విజేతలైన క్రీడాకారులను జిల్లా టెన్నికాయిట్ అసోషియేషన్ ఉపాధ్యక్షురాలు ఎ.కృష్ణకుమారి అభినందించి క్రీడాకారులకు సహకారం అందిస్తానన్నారు. క్రీడాకారులను అభినందిం చిన వారిలో అసోషియేషన్ సభ్యులు ఎం.నాగేశ్వరరావు, రామారావు తదితరులు అభినందించారు.

ఏడిదలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

మండపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ప్రత్యేక శానిటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. మండపేటలో వున్న 12 పంచాయతీల్లో వాటిని నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు తడిపొడి చెత్త, సేంద్రియ ఎరువు తయారీపై ఈవోపీఆర్‌డి దాసరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తడిపొడిచెత్తను వేరుచేసి శానిటరీ సిబ్బందికి అందించాలని వారు కోరారు. గ్రామాల్లోని ప్రజలకు తడిపొడి చెత్తపై వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండపేట మండలం ఏడిదలో కార్యదర్శి పి.శ్రీనివాస్, ద్వారపూడిలో కార్యదర్శి ఏవీవీ రమణతో పాటు కార్యదర్శులు సుబ్బారావు, వర్మ, ప్రసాద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో శనివారం ఉదయం తాజ్ రెస్టారెంటు మెట్లపై దేవాదుల చంద్రరావు (45) మృతి చెంది ఉండగా, స్థానికులు గుర్తించి సమాచారం అందించారు. మృతుడు సోదరుడి కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదుపై ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

తండ్రికి కుమార్తె దహన సంస్కారాలు

ఆలమూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తండ్రికి కూతురు దహన సంస్కారాలు నిర్వహించిన సంఘటన ఆలమూరులో శనివారం చోటు చేసుకుంది. ఆలమూరుకు చెందిన కొమ్మిశెట్టి లక్ష్మణరావు(55) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకు భవానీ, రూప అనే ఇద్దరు కుమార్తెలున్నారు. ద్వితీయ కుమార్తె రూప తండ్రికి శనివారం అంతిమ సంస్కారాలు జరుపుతున్న సంఘటన అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించింది.